




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 11 | సంచిక : 243 | పేజీలు : 8+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | శుక్రవారం 9 మే 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda




# ప్రభుత్వ ప్రజా ఆస్తుల పరిరక్షణే "హైడ్రా" ఉద్దేశం

## సికింద్రాబాద్ బుద్ధభవన్‌లో 'హైడ్రా' పోలీస్ స్టేషన్ ప్రారంభం


హైడ్రా పోలీస్ స్టేషన్ ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి..

- ఇతర మెట్రో నగరాల సమస్యలు హైదరాబాద్‌కు రాకుండా చూడటమే లక్ష్యమన్న రేవంత్
- చెరువులు, నాలాల ఆక్రమణల నియంత్రణకు 'హైడ్రా' ఏర్పాటు
- ప్రభుత్వ, ప్రజా ఆస్తుల పరిరక్షణే 'హైడ్రా' ఉద్దేశం
- ముంపు బాధితుల సమస్యలకు తక్షణమే పరిష్కారం అందిస్తున్న హైడ్రా
- ఏ శాఖ పరిధిలోని సమస్య అయినా హైడ్రా పరిష్కరిస్తుందని కమిషనర్ రంగనాథ్ వెల్లడి
- హైడ్రా కృషితో చెరువులు, నాలాల కబ్జాలు తగ్గుముఖం

2లో

# 'ఆపరేషన్ సిందూర్' వారికి సమాధానం

## హైదరాబాద్ ర్యాలీలో రేవంత్ రెడ్డి




- ఉగ్రవాదానికి వ్యతిరేకంగా, సైన్యానికి సంఘీభావంగా ర్యాలీ
- సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్డు వరకు భారీ ర్యాలీ
- వీర జవాన్లకు 140 కోట్ల మంది భారతీయులు అండగా ఉంటారన్న సీఎం

హైదరాబాద్ పెన్ పవర్:ఉగ్రవాదానికి వ్యతిరేకంగా, సైన్యానికి సంఘీభా వంగా తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ ర్యాలీకి నగరంలోని

వివరాలు 2లో..

### ములుగులో మందుపాతర పేలుడు..

# ముగ్గురు పోలీసుల మృతి!

- ములుగు జిల్లా వాజేడులో మందుపాతర పేలుడు ఘటన
- మావోయిస్టుల కోసం కూంబింగ్ చేస్తుండగా దుర్ఘటన
- కర్రెగుట్టల ఎన్‌కౌంటర్ నేపథ్యంలో అడవుల్లో గాలింపు



హైదరాబాద్ పెన్ పవర్:ములుగు జిల్లాలో మావో యిస్టులు అమర్చినట్లు భావిస్తున్న మందుపాతర పేలిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఈ దుర్ఘటనలో ముగ్గురు పోలీసులు ప్రాణాలు కోల్పోయినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు ధృవీకరించాల్సి ఉంది.వాజేడు మండల పరిధిలోని వెంకటాపురం మండల సరిహద్దుల్లో గల అటవీ ప్రాంతంలో ఈ సంఘటన

వివరాలు 2లో..

# ఇది ఊహకందనిది

## కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

- ఆపరేషన్ సిందూర్" పై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసలు
- ఆపరేషన్ కచ్చితత్వం ఊహకందనిదని, అత్యంత ప్రశంసనీయమని వ్యాఖ్య
- తొమ్మిది ఉగ్రవాద శిబిరాలు ధ్వంసం, పలువురు ఉగ్రవాదులు హతం
- అమాయకులకు హాని కలగకుండా, తక్కువ నష్టంతో ఆపరేషన్ పూర్తి



### ప్రతి జిల్లాకు మొబైల్ క్యాన్సర్ సెంటర్లు..

# రాష్ట్రంలో 80 ట్రామా సెంటర్లు

## మంత్రి దామోదర రాజనర్సింహ




హైదరాబాద్ పెన్ పవర్: ఖమ్మం జిల్లా రఘునాథ పాలెంలో మెడికల్ కాలేజీ భూమిపూజలో పాల్గొన్న ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కీలక వ్యాఖ్యలు చేశారు. సుమారు 6 నెలల నుంచి ఖమ్మం ఎప్పుడొస్తారని వెంటపడి

వివరాలు 2లో..

# దయచేసి భారత్ నుంచి పాకిస్థాన్‌ను కాపాడండి

## పాకిస్థాన్ ఎంపీ కన్నీంటి పర్యంతం

- భారత్ దాడులతో పాక్ విలవిల... పార్లమెంట్‌లో ఎంపీ ఆవేదన
- ఆపరేషన్ సిందూర్, పాక్‌లో డ్రోన్ల కలకలంపై ఎంపీ ఆందోళన
- భారత్ నుంచి మమ్మల్ని కాపాడలంటూ పాకిస్థాన్ ఎంపీ కన్నీరు!
- మనల్ని నిందితుల్లా చూస్తున్నారని ఆవేదన



వివరాలు 2లో..

### పాక్ మిస్సైల్ దాడులకు ప్రయత్నించింది..

# మేం కూడా అదే రేంజులో బదులిచ్చాం

- మరోసారి మీడియా ముందుకు వచ్చిన వ్యోమికా సింగ్, సోఫియా ఖురేషీ
- జమ్మూకశ్మీర్‌లో నియంత్రణ రేఖ వెంబడి పాక్ కాల్పుల ఉద్ధృతి
- కుప్వారా, బారాముల్లా, ఉరి, పూంచ్, రాజౌరి సెక్టార్లలో దాడులు
- పాక్ కాల్పుల్లో 3 మహిళలు, 5 చిన్నారులతో సహా 16 మంది అమాయకుల మృతి
- దాయాది చర్యలకు భారత్ బలమైన సమాధానం ఇచ్చిందన్న మహిళా సైనికాధికారులు
- పాక్ సంయమనం పాటిస్తే, ఉద్రిక్తతలు పెంచబోమని స్పష్టీకరణ



హైదరాబాద్ పెన్ పవర్:సరిహద్దు గ్రామాల ప్రజలపై కాల్పులు జరిపి 16 మంది అమాయకులను పొట్టనబెట్టుకున్నందునే పాకిస్థాన్ పై దాడులు చేయాల్సి వచ్చిందని భారత వాయుసేన వింగ్ కమాండర్

వివరాలు 2లో..

# మాజీ సైనికుడిగా... ఆపరేషన్ సిందూర్‌పై ఉత్తమ్ కుమార్ రెడ్డి

- ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్‌కు సైన్యం గుణపాఠమన్న మంత్రి
- పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర స్థావరాలపై విజయవంతమైన దాడులు
- మాజీ సైనికుడిగా భారత బలగాలకు ఉత్తమ్ అభినందనలు



హైదరాబాద్ పెన్ పవర్:పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవా దంపై భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయ వంతం కావడం పట్ల తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. భారత సాయుధ బలగాలు పాకిస్థాన్‌కు తగిన రీతిలో బుద్ధి చెప్పాయని ఆయన అన్నారు. మాజీ సైనికుడిగా, భారత సైన్యం ప్రదర్శించిన పరాక్రమానికి అభినందనలు తెలియజేస్తున్నట్టు వెల్లడించారు. జమ్ముకశ్మీర్‌లో ఇటీవల భారతీయ పర్యాటకులపై పాకిస్థాన్ ఉగ్రమూకలు జరిపిన దాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ దాడులను ప్రపంచ దేశాలు ఖండించగా, పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఇస్తామని

వివరాలు 2లో..

# భారత్ దాడిలో దెబ్బతిన్న రావల్పిండి క్రికెట్ స్టేడియం

- భారత్ లోని పలు నగరాలపై దాడికి యత్నించిన పాక్
- ప్రతీకార దాడులు చేస్తున్న భారత్
- పాక్ ఆర్మీ హెడ్ క్వార్టర్ ఉండే రావల్పిండిపై డ్రోన్లతో దాడి?



హైదరాబాద్ పెన్ పవర్:భారత్ లోని పలు నగరాలపై దాడులకు యత్నించిన పాక్ ప్రయత్నాలను భారత బలగాలు తిప్పికొట్టాయి. పాక్ మిస్సైల్ ను గాల్లోనే పేల్చివేశాయి. దీనికి సమాధానంగా భారత్... పాక్ పై డ్రోన్లతో విరుచుకుపడుతోంది. లాహోర్ లోని కీలక ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ను ధ్వంసం చేసింది. పాక్ ఆర్మీ హెడ్ క్వార్టర్ ఉండే రావల్పిండిపై కూడా డ్రోన్ దాడులు జరిగినట్టు తెలుస్తోంది. కాగా, రావల్పిండి క్రికెట్ స్టేడియం వద్ద ఓ డ్రోన్ కూలిపోయినట్టు తెలిసింది. దాంతో, అక్కడి రెస్టారెంట్ తో పాటు, స్టేడియం

వివరాలు 2లో..

### జమ్మూపై పాక్ క్షిపణి, డ్రోన్ల దాడి...

# సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్తత

- 15 భారత నగరాలపై పాక్ దాడి విఫలమైన కొద్ది గంటల్లోనే జమ్మూ కశ్మీర్‌పై దాడి
- జమ్మూలో భారీ పేలుళ్లబీ క్షిపణులు, డ్రోన్లతో దాడి జరిగినట్లు అనుమానంబీ విద్యుత్ సరఫరా నిలిపివేత
- సాంబా, పూంచ్ తదితర సరిహద్దు సెక్టార్లలో పాక్ నుంచి తీవ్రస్థాయిలో షెల్లింగ్
- భారత వాయు రక్షణ వ్యవస్థలు పాక్ క్షిపణులు, డ్రోన్లను అడ్డగించినట్లు స్థానికుల కథనం
- పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' అనంతరం పెరిగిన ఉద్రిక్తతలు

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# నేను మారాను.. నన్ను అర్ధం చేసుకోండి ప్లీజ్

వైసీపీ అధినేత వైఎస్ జగన్ నేడు తరచూ ఒకే మాట చెబుతున్నారు. తాను మారానని అంటున్నారు. అంటే గతంలో తాను చేసిన తప్పులేమిటో ఆయన అర్ధం చేసుకునట్లే ఉంది. ఎందుకంటే మారానంటూ ఆయన ఏ నేతలతో సమావేశమైనా ఇదేరకమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. నేతలకు దూరంగా ఉండటం, కార్యకర్తలతో టచ్ మీ నాట్ అంటూ వ్యవహరించడంతో పాటు ప్రజలకు కూడా దూరమై కేవలం తాడేపల్లి లోని క్యాంప్ కార్యాలయానికే ఆయన అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు పనిచేశారు. అప్పుడు ఎవరి మాట చెవికెక్కించుకోలేదు. అధికారులను చుట్టూపెట్టుకుని వారు ఆడినట్లే ఆడారు. దాని ఫలితంగానే దారుణమైన ఓటమిని చవి చూడాల్సి వచ్చింది.

**చుట్టూ కోటరీ...**

దీంతో పాటు చుట్టూ కోటరీ కూడా జగన్ ఓటమికి కారణమయింది. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు జగన్ దృష్టికి వారు తీసుకెళ్లలేదు. అంతేకాదు.. జగన్ ఏం చెప్పినా దానికి ఊ కొట్టడమే తప్పించి అలా కాదు.. ఇలా చేస్తే బాగుంటుందన్న సలహాలు, సూచనలు చేసిన వారు కూడా లేరు. అసలు జగన్ వింటారని అనుకోలేం కానీ కానీ కనీసం ఆ ప్రయత్నం చేసిన నేతలు కూడా లేరు. అధికారంలో ఉన్నప్పుడు ఆ వ్యవహారం నడిచింది. అయితే అధికారం కోల్పోయిన తర్వాత తాను ఏం తప్పులు చేశారో ఇప్పుడు అర్ధమవుతుంది. తాను తీసుకున్న నిర్ణయాలతో ఎంత మంది బాధపడ్డారు.. తన విజయం కోసం పనిచేసిన వారే ఆర్ధికంగా నష్టపోయారన్న విషయం జగన్ కు ఇప్పటి కాని తెలిసి రాలేదు.

**సంక్షేమ పథకాలను అమలు చేసినా...**

దీంతో రాష్ట్రంలో సంక్షేమ పథకాలను భారీ స్థాయిలో అమలు చేసినా ప్రజలు గెలిపించకపోవడానికి అనేక కారణాలున్నాయి. నలభై శాతం ఓట్లు వచ్చాయని, మూడు పార్టీలు కలవడంతోనే కూటమి గెలిచిందని నచ్చ చెప్పుకున్నప్పటికీ నాడు తాను చేసిన పనుల కారణంగానే పది శాతం ఓట్లు పూర్తిగా దూరమయ్యాయన్నది అర్ధమయింది. ప్రధానంగా మధ్యతరగతి, కొన్ని సామాజికవర్గాల వారిని జగన్ కావాలని దూరం చేసుకున్నారు. ఇక అనేక చోట్ల వైసీపీ ఎమ్మెల్యేలు, కొందరు నేతలు భూ కబ్జాలకు పాల్పడుతున్నా పట్టించుకోలేదు. ఒకటి రెండు ఫిర్యాదులు వచ్చినా భూ కబ్జాలు చేసిన వారిని వెనకేసుకు వచ్చారు. దీంతో తమఆస్తులకు రక్షణ లేకుండా పోయిందన్న అభద్రత నెలకొంది.

**వాలంటీర్లే అసలు సమస్యా?**

మరొక వైపు వాలంటీర్లు దారుణంగా పార్టీని దెబ్బతీశారు. తాజాగా మాజీ మంత్రి గుడివాడ అమర్ నాధ్ కూడా వాలంటీర్ల వల్లనే తాము ఓడిపోయామని చెప్పారంటే జగన్ కు అర్ధం కాకుండా ఉంటుందా? వాలంటీర్లే అన్నీ పనులు చేస్తుంటే కార్యకర్తలతో ప్రజలకు పనిలేకుండా పోయింది. ఎమ్మెల్యేలు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు. దీంతో మరొకసారి తాను గెలుద్దామని అనుకుంటే.. వాలంటీర్లు కూడా ఎన్నికల్లో సహకరించకుండా ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధించింది. దీంతో ఓటర్లు చంద్రబాబు ఇచ్చిన హామీలకు అటు వెళ్లిపోయారు. ఇప్పుడు జగన్ మారారంటున్నారు. అధికారంలోకి వస్తే తాను కార్యకర్తలకు పెద్దపీట వేస్తానని చెబుతున్నారు. వారికి ప్రాధాన్యత ఇస్తానని అంటున్నారు. అదే సమయంలో తనను నమ్ముకున్న వారికి అన్యాయం చేయనని పదే పదే చెబుతున్నారు. మరి ఏం జరుగుతుందన్నది భవిష్యత్ సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

# దయచేసి భారత్ నుంచి పాకిస్థాన్‌ను కాపాడండి

**పెన్ పవర్ డెస్క్:**పహల్గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రదా డి అనంతరం భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య దాడులు, ప్రతిదాడులు చోటుచేసుకుంటున్నాయి. నిన్న ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన భారత్, నేడు పాక్ గగనతల రక్షణ వ్యవస్థలపై విరుచుకుపడింది. లాహోర్, ఇస్లామాబాద్, కరాచీ, గుజ్రాన్‌వాలా సహా మొత్తం 12 నగరాలపై డ్రోన్లు కలకలం రేపాయి. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో పాకిస్థాన్ ఎంపీ ఒకరు వారి పార్లమెంటులో ఒకింత కన్నీటి పర్యంతమయ్యారు.

ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, పాకిస్థాన్ పార్లమెంట్‌లో సదరు పార్లమెంట్ సభ్యుడు కన్నీటిపర్యంతమైన దృశ్యాలు సామాజిక మాధ్యమంలో వైరల్ అయ్యాయి.

సదరు ఎంపీ పార్లమెంట్‌లో మాట్లాడుతూ, “దయచేసి భారత్ నుంచి పాకిస్థాన్‌ను కాపాడండి. మిమ్మల్ని వేడుకుంటున్నాను” అని రోదిస్తూ అభ్యర్థించారు. “ఇది మా తప్పిదమో, మా లోపమో, లేదా మరేదైనా కారణమో తెలియదు కానీ, ప్రస్తుతం మమ్మల్ని అన్నిచోట్లా నిందితుల్లా పరిగణిస్తున్నారు. మనమందరం దేవుడిని క్షమాపణ కోరాలి” అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ ప్రజా ఆస్తుల పరిరక్షణే “హైడ్రా” ఉద్దేశం..

హైదరాబాద్ నగరం దేశంలోని ఇతర మహానగరాలు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యల బారిన పడకుండా చూడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ దిశగా పటిష్ట చర్యలు చేపట్టేందుకే ‘హైడ్రా’ను ఏర్పాటు చేశామన్నారు. సికింద్రాబాద్‌లోని బుద్ధభవన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హైడ్రా పోలీస్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బెంగళూరులో తాగునీటి ఎద్దడి, ముంబై, చెన్నై నగరాల్లో వరద బీభత్సం, ఢిల్లీలో వాయు కాలుష్యం వంటి పరిస్థితులు చూస్తున్నామని, అలాంటి దుస్థితి హైదరాబాద్‌కు రాకుండా చూడటానికే ఎన్ని విమర్శలు ఎదురైనా ఆక్రమణలపై కఠినంగా వ్యవహరిస్తామని తేల్చి చెప్పారు. మన పూర్వీకులు అందించిన చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. చెరువులు కనుమరుగైతే మానవ మనుగడకే ప్రమాదమని హెచ్చరించారు. 450 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన హైదరాబాద్ నగరాన్ని పరిరక్షించడంలో హైడ్రా కీలక పాత్ర పోషిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సుపరిపాలన కోసం రాజ్యాంగాన్ని అనేకసార్లు సవరించుకున్నట్లే, నగరాభివృద్ధికి గత ముఖ్యమంత్రులు ఎన్నో చట్టాలు చేశారని గుర్తుచేశారు.

1908లో హైదరాబాద్‌ను ముంచెత్తిన వరదలు నాటి నిజాం ప్రభుత్వాన్ని కదిలించాయని, దీంతో గొప్ప ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను వినియోగించుకుని మూసీపై డ్రైనేజీ వ్యవస్థను నిర్మించారని తెలిపారు. పాతబస్తీ అంటే వెనుకబడిన ప్రాంతం కాదని, అది ‘ఒరిజనల్ సిటీ’ అని భావించి అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. హైడ్రా అంటే ఇళ్లు కూల్చే విభాగమని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, కానీ వాస్తవానికి ఇది ప్రభుత్వ, ప్రజా ఆస్తులను కాపాడే వ్యవస్థ అని స్పష్టం చేశారు. చిన్నపాటి వర్షానికే నగరంలోని కాలనీలు నీట మునుగుతున్నాయని, పేదల కాలనీలకు వెళ్లే మార్గాలను కొందరు పెద్దలు ఆక్రమిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జాకు గురైన చెరువులు, నాలాలు, కాలనీ రోడ్లను హైడ్రా పరిరక్షిస్తుందని తెలిపారు. వర్షాలకు రోడ్లపై కూలిన చెట్లను సైతం హైడ్రా సిబ్బంది నిమిషాల్లో తొలగిస్తున్నారని గుర్తుచేశారు.

కొందరు లేక్‌వ్యూ పేరుతో

చెరువుల సమీపంలో ఫామ్‌హౌస్‌లు, గెస్ట్‌హౌస్‌లు నిర్మించుకుని, వ్యర్థాలను, మురుగునీటిని నేరుగా చెరువుల్లోకి వదులుతున్నారని, ఇలాంటి అక్రమార్కులకే హైడ్రా అంటే భయమని అన్నారు. వరదనీరు ప్రవహించాల్సిన నాలాలపై అక్రమంగా ఇళ్లు, అపార్ట్‌మెంట్‌లు నిర్మించారని, మూసీ పక్కన నివసించే వారి కష్టాలు ఆక్రమణలకు పాల్పడే నేతలకు తెలియవని చురకలంటించారు. మూసీ నదిని ప్రక్షాళన చేసి, నగర ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించాలన్నదే తమ సంకల్పమని సీఎం పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. “గంగా, యమునా నదులను ప్రక్షాళన చేస్తే తప్పులేదు గానీ, మేం మూసీని బాగుచేస్తామంటే తప్పా? మోదీ, యోగి చేస్తే గొప్ప, తెలంగాణ ప్రజలు తమ నగరాన్ని బాగుచేసుకుంటే తప్పా?” అని ప్రశ్నించారు. మూసీ ఆక్రమణలు తొలగిస్తే రియల్ ఎస్టేట్ దెబ్బతింటుందని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కంచ గచ్చిబౌలిలోని ఐఎంజీ భారత్ సంస్థ చేతిలో ఉన్న 400 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని తమ ప్రభుత్వం కోర్టులో పోరాడి కాపాడిందని తెలిపారు. ఈ భూమి పదేళ్లుగా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ స్థలంలో కంపెనీలు వస్తే లక్షలాది ఉద్యోగాలు వచ్చేవని, కానీ నగరాభివృద్ధిని, ఉపాధి అవకాశాలను అడ్డుకున్నారని విమర్శించారు.

**హైడ్రా అలాంటి సమస్యలను కూడా పరిష్కరిస్తోంది: హైడ్రా కమిషనర్ రంగనాథ్**

హైదరాబాద్ నగరంలో ముంపు బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారాలు అందించడంలో హైడ్రా కీలక పాత్ర పోషిస్తోందని ఆ సంస్థ కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హైడ్రా కార్యక్రమంలో భాగంగా, సికింద్రాబాద్‌లోని బుద్ధ భవన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హైడ్రా పోలీస్ స్టేషన్ భవనాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హైడ్రాకు కేటాయించిన నూతన వాహనాలు, యంత్రాలను కూడా సీఎం ఆవిష్కరించారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ, ప్రజలు ఏ ప్రభుత్వ విభాగాన్ని సంప్రదించాలో తెలియని క్లిష్టమైన సమస్యలను సైతం హైడ్రా స్వీకరించి, పరిష్కరిస్తోందని తెలిపారు.“ఏదైనా సమస్య మా పరిధిలోకి రాదని చెప్పి మేం ఎప్పుడూ గిరిగీసుకోలేదు. ఏ శాఖకు సంబంధించిన బాధ్యత అయినా, తక్షణమే స్పందించి ఆ పనిని మేం పూర్తి చేస్తున్నాం” అని వివరించారు. హైడ్రా చొరవ కారణంగా నగరంలో చెరువులు, నాలాల ఆక్రమణలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని రంగనాథ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా హైడ్రా చేపడుతున్న వివిధ కార్యక్రమాలను, వాటి ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను ఆయన వివరంగా తెలియజేశారు.

# ‘ఆపరేషన్ సిందూర్’ వారికి సమాధానం

- మొదటి పేజీ తరువాయి

యువత పెద్ద ఎత్తున తరలి వచ్చింది. సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు.

ఈ ర్యాలీ అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, భారత దేశ సార్వభౌమత్వంపై ఎవరైనా దాడి చేస్తే ఊరుకునేది లేదని అన్నారు. తమ శాంత స్వభావాన్ని చేతకానితనంగా భావించవద్దని హెచ్చరించారు.భారత భూభాగంలో కాలు మోపి, తమ ఆడబిడ్డల నుదుటి సిందూరాన్ని తుడిచి వేయాలనుకుంటే ‘ఆపరేషన్ సిందూర్’ ఇందుకు సమాధానం అని అన్నారు. ఆపరేషన్ సిందూర్ వంటి వాటి ద్వారా మిమ్మల్ని నేలమట్టం చేసే శక్తి భారత వీర జవాన్లకు ఉందని అన్నారు. ఆ వీర జవాన్లకు 140 కోట్ల మంది భారతీయులు అండగా ఉంటారని అన్నారు.భారత్ వైపు కన్నెత్తి చూస్తే మీకు నూకలు చెల్లినట్లేనని హెచ్చరించారు. బ్రిటిష్ వాళ్ల నుంచి శాంతి ద్వారానే భారత్‌తో పాటు పాక్‌కు కూడా స్వేచ్ఛా వాయువులు అందించి మహాత్మా గాంధీ అమరులయ్యారని, ఆయన చేసిన శాంతియుత పోరాటం వల్లే మనం ఈ రోజు స్వేచ్ఛను అనుభవిస్తున్నామని అన్నారు.

# మాజీ సైనికుడిగా... ఆపరేషన్ సిందూర్‌పై ఉత్తమ్ కుమార్ రెడ్డి

- మొదటి పేజీ తరువాయి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హెచ్చరించారు. దీనికి అనుగుణంగా, భారత త్రివిధ దళాలు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై ‘ఆపరేషన్ సిందూర్’ పేరిట దాడులు నిర్వహించి, విజయవంతంగా లక్ష్యాలను ఛేదించాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో వెంకటేశ్వర మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించిన అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, కోదాడ పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆసుపత్రిని ఏర్పాటు చేశారని, నిర్వాహకులను అభినందించారు.

ఉత్తమ్ కుమార్ రెడ్డి గతంలో భారత వాయుసేన యుద్ధ విమాన పైలెట్ అని తెలిసిందే. ఆయన మిగ్–21 తదితర ఫైటర్ జెట్లకు పైలెట్ గా విధులు నిర్వర్తించారు.

# జమ్మూపై పాక్ క్షిపణి, డ్రోన్ల దాడి... సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్తత

**హైదరాబాద్ పెన్ పవర్:**భారతదేశంలోని పదిహేను నగరాలపై ఉగ్రవాద దాడులకు పాకిస్థాన్ చేసిన ప్రయత్నం విఫలమైన కొద్ది గంటల వ్యవధిలోనే, జమ్మూ కశ్మీర్‌లోని పలు ప్రాంతాలపై పాకిస్థాన్ దాడులకు తెగబడింది. ఈ పరిణామంతో సరిహద్దుల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ముఖ్యంగా జమ్మూ నగరం క్షిపణులు, డ్రోన్ల దాడితో దద్దరిల్లింది.శుక్రవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో జమ్మూ నగరంలో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. అనంతరం అత్యవసర సైరన్లు మోగడంతో పాటు నగరం మొత్తం అంధకారంలోకి వెళ్లిపోయింది. పాకిస్థాన్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్లను భారత వాయు రక్షణ వ్యవస్థలు ఆకాశంలోనే అడ్డగించినట్లు, ఆ సమయంలో కాంతి రేఖలు కనిపించాయని స్థానికులు సెల్‌ఫోన్లలో చిత్రీకరించిన వీడియోల ద్వారా తెలుస్తోంది. జమ్మూతో పాటు 300 కిలోమీటర్ల దూరంలోని కుప్వారా, పంజాబ్‌లోని పఠాన్‌కోట్, గురుదాస్‌పూర్ పట్టణాలలో కూడా విద్యుత్ సరఫరా నిలిపివేసి, బ్లాక్‌అవుట్ ప్రకటించారు. బారాముల్లాలోనూ పూర్తిస్థాయి బ్లాక్‌అవుట్ అమలులో ఉంది.అంతర్జాతీయ సరిహద్దు వెంబడి సాంబా, అఖ్నూర్, రాజౌరి,

రియాసి సెక్టార్లలో పాకిస్థాన్ సైన్యం ఇప్పటికే తీవ్రస్థాయిలో షెల్లింగ్‌కు పాల్పడుతోంది. జమ్మూ విమానాశ్రయంపై కూడా పలు దాడులు జరిగినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అంతర్జాతీయ సరిహద్దు వెంబడి పెద్ద ఎత్తున డ్రోన్ దాడులు జరిగినట్లు సమాచారం.“జమ్మూలో పూర్తి బ్లాక్‌అవుట్. భారీ పేలుళ్లు, బాంబు దాడులు, షెల్లింగ్, లేదా క్షిపణి దాడులని అనుమానిస్తున్నాం. ఆందోళన చెందవద్దు... మాతా వైష్ణో దేవి మనతో ఉంది, అలాగే మన వీర భారత సాయుధ దళాలు కూడా ఉన్నాయి” అని జమ్మూ కశ్మీర్ మాజీ డీజీపీ శేష్ పాల్ వైద్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా సరిహద్దు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# ప్రతి జిల్లాకు మొబైల్ క్యాన్సర్ సెంటర్లు.. రాష్ట్రంలో 80 ట్రామా సెంటర్లు

- మొదటి పేజీ తరువాయి

భూమిపూజ చేయించుకున్నారని అన్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో విద్యాపరంగా మెడికల్ కాలేజీ చాలా ముఖ్యమని.. ఎంత అవసరమో అన్ని ప్రైమరీ హెల్త్ సెంటర్స్ ఇస్తామని అన్నారు. వైద్యం కోసం హైదరాబాద్ వరకు రాకుండా ఇక్కడే ఉండాలని మెడికల్ కాలేజీ కడుతున్నామని అన్నారు. ప్రతి జిల్లాలో మొబైల్ క్యాన్సర్ సెంటర్స్, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి 35 కిలోమీటర్లకు ఒక ట్రామా సెంటర్ ఏర్పాటు చేస్తామని.. త్వరలో 80 ట్రామా సెంటర్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు మంత్రి రాజనర్సింహ.వరంగల్ జిల్లాలో ఉచిత కాన్సర్ టెస్ట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. డయాలసిస్ పేషేంట్ల కోసం సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. ప్రతి ఆదివాసి మండలానికి రెండు అంబులెన్స్ లు ఇచ్చామని.. వందనం,కోడుమూరు ప్రాంతాల్లో నర్సింగ్ కలాశాల ఇవ్వబోతున్నామని అన్నారు. ఖమ్మం,వరంగల్,కరీంనగర్ లలో %జ% సెక్షన్ ఆపరేషన్ లు బాగా జరుగుతున్నాయని, అవి తగ్గాలని అన్నారు. ప్రజలు వైద్యుణ్ణి దేవుడిగా నమ్ముతారని.. ఆ నమ్మకాన్ని వమ్ము చేయొద్దని అన్నారు. త్వరలో ఏర్పాటు చేయబోయే ఒక్కో ట్రామా సెంటర్ కు 5 కోట్లు ఖర్చు పెట్టబోతున్నామని తెలిపారు. ఇప్పటిదాకా 8 వేల పోస్టులు భర్తీ చేసామని..త్వరలో మళ్లీ భర్తీ చేయబోతున్నామని అన్నారు రాజనర్సింహ. రాబోయే నోటిఫికేషన్లలో వర్గీకరణ ఇంప్లిమెంటేషన్ ఉంటుందని.. వర్గీకరణ వల్ల ఎవరికీ నష్టం లేదని అన్నారు. ప్రజా అవసరాలను బట్టి వసతులు ఏర్పాటు చేస్తామని అన్నారు మంత్రి రాజనర్సింహ.

# ఇది ఊహకందనిది

**పెన్ పవర్ డెస్క్:**భారత రక్షణ దళాలు నిర్వహించి న ‘ఆపరేషన్ సిందూర్’ విజయవంతం కావడం పట్ల కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ఆపరేషన్ నిర్వహించిన తీరు, దాని కచ్చితత్వం ఊహకందనిదని, ఇది అత్యంత ప్రశంసనీయమైన విజయమని ఆయన కొనియాడారు. మన సైన్యం చూపిన ధైర్యసాహసాలకు వారిని అభినందిస్తున్నానని ఆయన అన్నారు.‘ఆపరేషన్ సిందూర్’ గురించి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, “ఆపరేషన్ సిందూర్ అత్యంత కచ్చితత్వంతో నిర్వహించబడింది, ఇది ఊహకు కూడా అందని విషయం, చాలా ప్రశంసించదగినది” అని పేర్కొన్నారు. ఈ కీలకమైన ఆపరేషన్‌లో భాగంగా తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను విజయవంతంగా ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. అంతేకాకుండా, ఈ చర్యలో పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులు హతమైనట్లు మంత్రి తెలిపారు.ఈ ఆపరేషన్ యొక్క విశిష్టతను వివరిస్తూ, ఏ ఒక్క అమాయకుడికీ ఎలాంటి హాని కలగకుండా, అత్యంత కనిష్ట స్థాయిలో అనుబంధ నష్టంతో దీనిని పూర్తి చేయడం జరిగిందని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఇటువంటి సంక్లిష్టమైన ఆపరేషన్లను అతి తక్కువ నష్టంతో పూర్తి చేయడం భారత దళాల సామర్థ్యానికి, వ్యూహాత్మక నైపుణ్యానికి నిదర్శనమని ఆయన అన్నారు. భద్రతా దళాల అంకితభావం, సాహసోపేతమైన చర్యల వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు.

# ములుగులో మందుపాతర పేలుడు.. ముగ్గురు పోలీసుల మృతి!

- మొదటి పేజీ తరువాయి

చోటు చేసుకుంది. నిషేధిత మావో యిస్టు పార్టీ కార్యకలాపాల నేపథ్యంలో పోలీసులు ఆ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలిందని సమాచారం.ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన కర్రెగుట్టల్లో నిన్న భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య భారీస్థాయిలో ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఆపరేషన్‌లో 22 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ భారీ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో, మావోయిస్టుల కదలికలు పెరిగే అవకాశం ఉందని భావించిన పోలీసులు, సరిహద్దు ప్రాంతాలతో పాటు ములుగు జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. వెంకటాపురం పరిసర అటవీ ప్రాంతంలో చేపట్టిన ఈ కూంబింగ్ ఆపరేషన్ సందర్భంగానే ఈ మందుపాతర పేలుడు సంభవించింది.

# భారత్ దాడిలో దెబ్బతిన్న రావల్పిండి క్రికెట్ స్టేడియం

- మొదటి పేజీ తరువాయి

కొంత మేర దెబ్బతిన్నట్టు సమాచారం. ఈ దాడిలో ఇద్దరు గా య పడ్డారు. వీరిని ఆసుపత్రికి తరలించారు. రావల్పిండిలో ఈ రాత్రి పీఎస్ఎల్ క్రికెట్ మ్యాచ్ జరగాల్సి ఉంది. ఈ మ్యాచ్ నిర్వహణపై అనుమాన మేఘాలు అలముకున్నాయి. భారత్ తో ఉద్రిక్తతల నేపథ్యంలో పీఎస్ఎల్ లోని మిగతా మ్యాచ్ లను పాక్ క్రికెట్ బోర్డు దుబాయ్ కి మార్చాలని ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది.

# పాక్ మిసైల్ దాడులకు ప్రయత్నించింది.. మేం కూడా అదే రేంజులో బదులిచ్చాం

- మొదటి పేజీ తరువాయి

వ్యోమికా సింగ్, కల్నల్ సోఫియా ఖురేషీ వెల్లడించారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా పాక్, పీవోకేలోని ఉగ్రస్థావరాలపై భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టి విజయవంతం కాగా, ఈ సాహసోపేత ఆపరేషన్ కు ఆర్మీ కల్నల్ సోఫియా ఖురేషి, వాయుసేన వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ నేతృత్వం వహించారు. ఆపరేషన్ అనంతరం వారిద్దరూ మీడియా ముందుకు వచ్చి బ్రీఫింగ్ ఇచ్చారు. ఇవాళ, పాక్ పై ఆపరేషన్ సిందూర్ 2.0 అనంతరం వ్యోమికా సింగ్, సోఫియా ఖురేషీ మరోసారి మీడియా ముందుకు వచ్చారు.జమ్మూకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) వెంబడి పాకిస్థాన్ సైన్యం తన దుందుడుకు చర్యలను మరింత తీవ్రతరం చేసిందని, అకారణంగా జరుపుతున్న కాల్పుల కారణంగా ముగ్గురు మహిళలు, ఐదుగురు చిన్నారులతో సహా మొత్తం 16 మంది అమాయక భారతీయులు ప్రాణాలు కోల్పోయారని వెల్లడించారు. పాకిస్థాన్ దుశ్చర్యలకు భారత సైనిక దళాలు ధీటుగా ప్రతిస్పందించాయని వారు తెలిపారు.“జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా, బారాముల్లా, ఉరి, పూంచ్, మేంధార్ మరియు రాజౌరి సెక్టార్లలో నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ ఎటువంటి కవ్వింపు చర్యలు లేకుండానే మోర్టార్లు, భారీ శతఘ్నులతో కాల్పుల తీవ్రతను గణనీయంగా పెంచింది” అని తెలిపారు. ఈ కాల్పుల వల్ల అమాయకులైన పౌరులు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పాకిస్థాన్ సైన్యం జరుపుతున్న ఈ అకారణ కాల్పులను అడ్డుకోవడానికి, వారి మోర్టార్ మరియు శతఘ్నుల దాడులను నిలువరించడానికి భారత్ తప్పనిసరి పరిస్థితుల్లో ప్రతిస్పందించాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. “పాకిస్థాన్ నుంచి వస్తున్న కాల్పులను ఆపడానికే భారత సైన్యం చర్యలు తీసుకుంది” అని వివరించారు.అయితే, పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చకూడదనే నిబద్ధతతో భారత సాయుధ దళాలు ఉన్నాయని పునరుద్ఘాటించారు. “పాకిస్థాన్ సైన్యం సంయమనం పాటిస్తూ, ఒప్పందాలను గౌరవిస్తే, మేము కూడా ఉద్రిక్తతలను పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకోము” అని పేర్కొన్నారు. సరిహద్దుల్లో శాంతిని కాపాడేందుకు తాము కట్టుబడి ఉన్నామని, అయితే దేశ సార్వభౌమత్వాన్ని, పౌరుల భద్రతను కాపాడుకోవడంలో రాజీపడే ప్రసక్తే లేదని పరోక్షంగా హెచ్చరించారు.

# ఈవీఎం గోదాంను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్

**హైదరాబాద్ పెన్ పవర్:** జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి ఈవీఎం గోదాంను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గోదాం చుట్టూ కలియ తిరిగారు లాగ్ బుక్ చెక్ చేసి విజిటర్స్ రిజిస్టర్ లో సంతకం చేశారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం చుట్టు సిసి కెమెరాల పనితీరు, పోలిస్ అధికారులు 24/7 గట్టి బందోబస్తు ఏర్పాటు అలాగే రెవెన్యూ అధికారులు తరుచు గోదాం పరిసర ప్రాంతాన్ని పర్యవేక్షణ చెయ్యాలని సూచించారు.

# ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్: పెన్ పవర్:** రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదినం సందర్భంగా చిగురు మామిడి మండలం సుదరగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్. జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేపించి మంత్రి పొన్నం ప్రభాకర్ చిగురు మామిడి మండల కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# అమ్మవారి శోభయాత్ర

**వనపర్తి: పెన్ పవర్:** శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి సందర్భంగా వనపర్తి పట్టణంలోని కన్యకా పరమేశ్వరి దేవాలయం నుండి అమ్మవారి శోభాయాత్ర ప్రారంభమై పురివీధుల నుండి కోలాటాలతో అంగరంగ వైభవంగా జరిగినది వనపర్తి పట్టణ ఆర్యవైశ్య సంఘం కన్వీనర్ పూరి బాలరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి సేవా సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పూరి సురేష్ శెట్టి పాల్గొని మాట్లాడుతూ వనపర్తి పట్టణ మహిళా సంఘం ఆధ్వర్యంలో పసుపుతో కోటి గౌరమ్మలు ఏర్పాటు చేయడం జరిగినది మహిళా సంఘం వారికి అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో నాగబండి యాదగిరి మారంబాలీ శ్వరయ్య ఆకుతోటా దేవరాజు దాచా శివకుమార్ లాగిశెట్టి అశోక్ వెంకటయ్య పూరి పాండు బచ్చు రాముఅమూర్తయ్య చిన్ని సురేష్ సి .శ్రీనివాసులు మహిళా సంఘం కార్యవర్గము పాల్గొన్నారు

# అమరావతికి చట్టబద్ధత

**విజయవాడ, పెన్ పవర్:** పునర్విభజన చట్టంలో విభజిత ఆంధ్రప్రదేశ్ రాజధాని స్థానంలో అమరావతి పేరు చేర్చే ప్రతిపాదనకు ఏపీ మంత్రిమండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు పదేళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ కొనసాగుతుందని 2014 ఏపీ పునర్విభజన చట్టంలో కేంద్రం పేర్కొంది. పదేళ్ల తర్వాత ఏపీ తమ రాజధానిని ఏర్పాటు చేసుకుంటుందని విభజన చట్టంలో కేంద్రం స్పష్టం చేసింది. అయితే నవ్యాంధ్ర ప్రదేశ్ ఏర్పడిన తర్వాత అప్పటి ప్రభుత్వం ఏపీ రాజధానిగా అమరావతిని ప్రకటించి ముందుకు వెళ్లింది. 2019లో ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానులు తమ విధానమని ముందుకు వెళ్లడంతో 2019 నుంచి 2024 వరకు రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ కొనసాగింది.అమరావతి ఏకైక రాజధాని విధానంతో 2024 సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి ఎన్డీఏ కూటమి ఏపీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇటీవల ప్రధాని మోదీ చేతుల మీదుగా రాజధాని అమరావతి నిర్మాణ పనులను రీలాంచ్ చేసింది. ప్రధాని పర్యటనకు ముందు రాజధాని రైతులు సీఎం చంద్రబాబును కలిసి అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కోరారు, ఈ అంశంపై కేంద్రంతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని చంద్రబాబు వారికి హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఏపీ పునర్విభజన చట్టంలో రాజధానిగా అమరావతి అని పెట్టాలని మంత్రి మండలి కేంద్రాన్ని కోరింది. దీని వలన అమరావతికి చట్టబద్ధత కల్పించినట్టు అవుతుందని కేబినెట్ పేర్కొంది.

# కశ్మీర్‌లో కొనసాగుతోన్న ఉగ్రవేట

**హైదరాబాద్ పెన్ పవర్:** పహల్‌గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల కోసం వేట కొనసాగుతోంది. ఉగ్రవాదుల కోసం భద్రతా సిబ్బంది, పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. అనుమానితుల నివాసాల్లో పోలీసులు ముమ్మరంగా సోదాలు నిర్వహించారు. ఇప్పటివరకు 100కు పైగా అనుమానిత ఉగ్రవాదులు, వారి అనుచరుల ఇళ్లల్లో తనిఖీలు చేసినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం 30కి పైగా ప్రాంతాల్లో సోదాలు చేసి.. ఆయుధాలు, డిజిటల్ పరికరాలు, సంబంధిత పత్రాలను స్వాధీనం చేసుకున్నారు...

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** పెండ్లిమర్రి మండలం కొత్తూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక కంటైనర్, బైకును బైక్ ను ఢీకొట్టింది. ఘటనలొఓ ముగ్గురు మృతి చెందారు. ఇద్దరూ ఘటనా స్థలంలో చనిపోగా, మరొకరు వేంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతులు వేంపల్లి శ్రీరామ్ నగర్ గుట్టకు చెందిన బాలయ్య, రాజీవ్ నగర్ కాలనీకి చెందిన మల్లికార్జున, మదనపల్లికి చెందిన మల్లికార్జున గా గుర్తించారు. ఘటనా స్థలం వద్దకు స్థానికుల సమాచారంతో చేరుకున్న పోలీసులు, ప్రమాదాన్నికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ముగ్గురి మృతితో వారి కుటుంబాలలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. .

# ముంబై నటి జెత్వాని కేసులో ఇద్దరు ఐపీఎస్లకు హైకోర్టులో బిగ్ రిలీఫ్

**హైదరాబాద్ పెన్ పవర్:** ముంబాయి నటి జెత్వాని కేసులో ఐపీఎస్ అధికారులు విశాల్ గున్ని, క్రాంతి రానా టాటా, పోలీసు అధికారులు ఏసీపీ హనుమంతరావు, సత్యనారాయలపై తదుపరి చర్యలు నిలుపుదల చేస్తూ హైకోర్టు ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.క్వాష్ పిటిషన్లపై తుది విచారణను జూన్ 30కు వాయిదా వేసింది.

# ఆపరేషన్ సిందూర్ లో వంద మంది ఉగ్రవాదులు హతం

## అఖిలపక్ష భేటీలోరక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆపరేషన్ సిందూర్లో 100 మంది ఉగ్రవాదులు హతమైనట్లు కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ స్పష్టం చేసారు. అంతేకాకుండా, ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతుందని వెల్లడించారు. పహల్గాం ఉగ్రదాడికి ఆపరేషన్ సిందూర్ పేరిట గట్టిగా బదులిచ్చిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు ఆ ఆపరేషన్ గురించి వివరించేందుకు గురువారం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. పార్లమెంట్లోని లైబరీ భవనంలో జరిగిన అఖిలపక్ష భేటీకి పలువురు నేతలు హాజరయ్యారు. ఆపరేషన్ సిందూర్పై రక్షణ మంత్రి రాజ్నాథ్ రాజకీయ పార్టీలకు వివరించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత అఖిలపక్ష భేటీ జరగడం ఇది రెండోసారి. కేంద్రం తరఫున మంత్రులు రాజ్నాథ్ సింగ్, అమిత్ షా, ఎస్.జైశంకర్, జేపీ నడ్డా, నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు.

# ఆపరేషన్ సిందూర్ కు సెల్యూట్ శత్రుసేనలపై భారత సైన్యం వీరోచిత పోరాటం

**హైదరాబాద్ పెన్ పవర్:**
ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ సైన్యం చేస్తున్న పోరాటం అనన్యాసమాన్యమైనదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.
భారత ప్రభుత్వం,దేశ ప్రజల లక్ష్యసాధన కోసం త్రివిధ దళాలు పాకిస్తాన్ లో,పాక్ ఆక్రమిత కాశ్మీర్ లో శత్రుసేనలకు చెందిన తొమ్మిది స్థావరాలపై చేసిన దాడులు విజయవంతం కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారుఈ మేరకు గురువారం మధ్యాహ్నం కోదాడలో ఓ ప్రవైట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అనంతరం మీడియా తో మాట్లాడారు.ప్రేరేపిత తీవ్రవాదాన్ని తుదముట్టించే ప్రక్రియలో త్రివిధ దళాలు చూపిన ధైర్య సాహసాలను చూసి దేశం గర్విస్తుందని ఆయన కొనియాడారు భారత వైమానికదళంలో పనిచేసిన అనుభవం తనకుందని,అందులో యుద్ధ విమానాల పైలట్ గా యుద్ధ సమయంలో పనిచేసిన అనుభవాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారుఆ అనుభవంతో చెబుతున్నా పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్గవాదాన్ని అణిచివేసేందుకు గాను త్రివిధ దళాలు సమర్ధవంతంగా,ఎంతో చాక చక్యంగా శత్రు శిబిరాలపై దాడులు జరిపి పాకిస్థాన్ కు సరైన గుణపాఠం



# చెట్నపల్లి స్మశాన వాటిక సమస్యపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైన ముద్దాయిలను అరెస్టు చేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** స్థానిక జై భీమ్ ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా కార్యదర్శి మాదిగ రత్నం ఆధ్వర్యంలో నేడు ఎమ్మిగనూరు డిఎస్పీ ఆఫీస్ ముందు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయిన ముద్దాయిలను అరెస్టు చేయాలని నిరసన కార్యక్రమం చేపట్టి ఈ సందర్భంగా జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ మాట్లాడుతూ కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం చెట్నాహళ్లి గ్రామ సర్వే నంబర్ 113=3.54 ఎకరములు మా ఇల్లు ముందున్న ఎస్సీ ల్యాండ్ సీలింగ్ (రస్తా పరంపోగు) భూమిని మాదిగలైన మేము గడ్డివాములు వేసుకొని జీవనం కొనసాగిస్తూ ఉండేవారము. అదేవిధంగా అన్ని కులాలు చనిపోతే అక్రమంగా ఇక్కడే పూడ్చేవారు. శవాలను పూడ్చడం వల్ల అపరిశుభ్రత ఏర్పడి,మాదిగలు ఎంతో అనారోగ్యానికి గురవుతుంటే, మా ఇళ్ళ ముందు, చనిపోయిన వాళ్లను పూడ్చకూడదని 2018 సంవత్సరం నుండి ఎన్నో ఉద్యమాలు చేస్తే అప్పట్లో ఉన్న మండల రెవిన్యూ అధికారులు మా గ్రామ సర్వేనెంబర్ 125,126 = 3.54 సెంట్లు భూమిని స్మశాన వాటికని కేటాయిస్తే, ఈ భూమిని పెద్ద పంపయ్య, పెద్ద బసన్న గౌడ్, తెలుగు భీమయ్యలు ఆక్రమించుకొని ఉన్నారు.వాళ్ళని భూమి నుండి తొలగించాలని అప్పటి అధికారులు నోటీసులు జారీ చేసిన వదలకుండా ఉన్నారు. అప్పటినుంచి అన్ని కులాల వారు అక్కడే పూడ్చుకుంటూ ఉండేవారు. కొంతమంది ఇతర కులం వారు అక్రమంగా స్మశానం కానటువంటి 113 సర్వే నంబర్ లోనే పూడుస్తూ అవసరమైతే మాదిగలు ఇళ్ల కడుపు మొద్దులకే పూడ్చి, ఇళ్ళ ముందే పుర్రెలు, ఎముకలు,మనిషి కళేబరాలు పడేసి వెళ్తూ ఉన్నారు. అయితే మా ఇల్లు ముందు ఉన్న 113 సర్వే నంబర్ రస్తా పరంబోక స్థలాన్ని 03-02-2025 వ తేదీన మా గ్రామానికి చెందిన బి.సి కులాలు కొంతమంది, అక్రమంగా ఆక్రమించుకోవాలని చూస్తే మేము అడ్డుకుంటే 04-02-2025 వ తేదీన ఉదయం 8:45 నిమిషాలకు నేను 113 సర్వేనెంబర్ లో పని నిమిత్తం వెళ్లి నిలబడగా ఒక్కసారిగా బీసీ కులానికి చెందిన రౌడీ మూకలు మాట వేసుకుని, బహిరంగంగా,వేట కొడవళ్ళు, గొడ్డెళ్ళు,కర్రలు, గడ్డపారలు తీసుకొని నా మీదకు చంపడానికి ప్రయత్నిస్తే నేను బిగ్గర్ గా కేకలు వేయగా మా చుట్టుపక్కల ఉన్న మాదిగలు వచ్చి నన్ను పట్టుకొనగా నేను ప్రాణాపాయంతో బయటపడుతూ ఉంటే, స్థలంలో పాతకున్న బండలను అక్రమంగా,దౌర్జన్యంగా పగలగొట్టి, గడ్డివాములకు నిప్పు అంటించి, ఆర్థికంగా నష్టపరిచి,నానా దుర్భాషలు మాట్లాడితే బాధితులు వెళ్లి మంత్రాలయం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా 06-02-2025 వ తేదీన బీసీ కులానికి చెందిన 50 మంది పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు కావడం జరిగింది. మాదిగలు స్థలం దగ్గరికి అక్రమంగా వచ్చి చంపడానికి ప్రయత్నించి, నష్టపరిచే, ఇబ్బందులకు,భయభ్రాంతులకు గురిచేయాలని గ్రామంలో లేకున్నా,ఏ తప్పు చేయని మా మాదిగల 32 మందిపై అక్రమంగా కేసు నమోదు చేపించి, మా గ్రామానికి చెందిన కొంతమంది బీసీలు చనిపోతే అక్రమంగా మాపై కేసు బనాయించిన 50 మంది బీసీ కులాలు రెచ్చగొట్టి,సూత్రధారులుగా ఉంటూ రాస్తా పరంబోకు సర్వేనెంబర్ 113 లో అక్రమంగా మా ఇళ్ల మధ్యనే ఇప్పటికి శవాలును పూడిపించడం జరిగింది. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మార్వో,సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లిన ఇప్పుడు చేస్తాం అప్పుడు చేస్తామని సాకులు చెప్పుతూ ఇంతవరకు చేయకుండా నిర్లక్ష్యంగానే ఉంటూ, గ్రామంలో 9 బీసీ కులాలు కలిసి, మాదిగ కాలినికి ఫిల్టర్ చేయనటువంటి నీళ్లను వదిలి రోగాలు తెప్పిస్తూ, రేషన్ బియ్యం రాకుండా అడ్డుకట్ట వేస్తూ,నిత్యవసర సరుకులకు బజార్ లోకి రానివ్వకుండా కులవివక్షత, అంటరానితనం చూపిస్తూ ఉంటే ఎమ్మిగనూరు డిఎస్పి, మంత్రాలయం సీఐ,మాకు ఏమి తెలియదని నిర్లక్ష్యం చేస్తున్నారు. అంతేకాకుండా మంత్రాలయం నియోజకవర్గం రాజకీయ నాయకులు మాదిగలతో ఓట్లు ఏపించుకొని, కావలసిగా మాదిగల ఇండ్ల ముందే శవాలను అక్రమంగా హద్దులు వేసుకొని పూడ్చాలని బీసీలకు, అధికారులకు హుకుం జారీ చేస్తున్నారు.ఈ సమస్య చేదించడానికి త్వరలో ఒక కార్యచరణాన్ని రూపొందించి, మాదిగల ఇళ్ళ ముందు శవాలు పూడ్చుకోకుండా, స్మశాన వాటికలోనే గ్రామంలో అన్ని కులాలు పూడ్చుకునే విధంగా విప్లవ పోరాటాలను కొనసాగిస్తామని మాట్లాడి, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయిన 50 మంది ముద్దాయిలను వెంటనే అరెస్టు చేయాలని మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో చట్నీపల్లి మాదిగలు పాల్గొన్నారు.




# పేదలందరికీ మెరుగైన వైద్య సదుపాయాలు

**- 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే విజయరమణ రావు**

**హైదరాబాద్ పెన్ పవర్:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ప్రజలకు ఆధునిక వసతులతో కూడిన మెరుగైన వైద్య సదుపాయాలను అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల నుండి 100 పడకలకు పెంచుతూ రూ.51 కోట్ల వ్యయంతో నిర్మించిన తలపెట్టిన ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి ఆయన ఆరోగ్య శాఖ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ, శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడగగానే 51 కోట్లు మంజూ రు చేశారని తెలిపారు.పెద్దపల్లి ఆసుపత్రిలో ఈ 15 నెలల్లో అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. దీంతో ఈ జిల్లా ఆస్పత్రికి వివిధ మండలాల నుంచి రోజు సుమారు రోజుకు 800 మంది ఆ పైన వచ్చి పరీక్షలు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రవేట్ హాస్పటల్ కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రి ఉండాలనే ఉద్దేశంతో నిరుపేదలకు అన్ని రకాల వైద్యం అందించాలని ఉద్దేశంతో ఈ 15 నెలల కాలంలో అన్ని రకాల పరీక్షలు చేసే పరికరాలను సమకూర్చ డం జరిగిందన్నారు. దీంతో నెలలో 200 ప్రసవాలు జరుగుతున్నాయని వివరించారు. గర్భవతులు పరీక్షల కోసం వస్తే గత ప్రభుత్వంలో ప్రభుత్వాసుపత్రిలో స్కానింగ్ సెంటర్ లేక ప్రైవేటులో సుమారు 3500 రూపాయలు పెట్టి పరీక్షలు చేసుకునేదని ప్రస్తుతం గర్భవతులకు స్కానింగ్ సెంటర్ కూడా ఆసుపత్రిలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆర్థోపెడిక్ ఆపరేషన్లు కూడా ఒక్క నెలలో 52 మందికి చేయడం జరిగింది అన్నారు. సుమారు 40 మందికి జనరల్ సర్జరీలు కూడా జరిగాయి అన్నారు. గతంలో డెంటల్ కు సంబంధించిన పరికరాలు డాక్టర్లు లేక ప్రైవేటు ఆస్పత్రి వైపు మొగ్గు చూపేవారని ప్రస్తుతం డెంటల్ కు సంబంధించిన పరికరాలు కూడా ఈ ఆస్పత్రిలో అందుబాటులో ఉండి ఒక్క నెలలోనే సుమారు 300 మందికి డెంటల్ వైద్య పరీక్షలు కూడా నిర్వహించడం జరిగింది అన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల లో గుండె పరీక్షలు చేయించుకుంటే సుమారు 4,500 రూపాయల వరకు ఖర్చు అవుతుందని ప్రస్తుతం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో గుండెకు సంబంధించిన పరీక్షలు కూడా ఉన్నాయని, 2 డి కో, ఈసీజీతోపాటు ఎంజీయోగ్రామ్ పరీక్షలు కూడా డాక్టర్లు చేస్తున్నారన్నారు. నెలకు సుమారు 200 మంది గుండె సంబంధించిన పరీక్షలు కూడా చేసుకోవడం జరుగుతుంది అన్నారు .ఈ 15 నెలల కాలంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలతో పాటు డాక్టర్లు అందరూ అందుబాటులో ఉంటున్నారన్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ఈ ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల శస్త్ర చికిత్సలు , డెలివరీలు, తదితర వైద్యం అందిస్తున్న డాక్టర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, ఆరోగ్య శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీ భవనాలకు శంకుస్థాపన చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి



**హైదరాబాద్ పెన్ పవర్:** : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మం జిల్లాలో మెడికల్ కళాశాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో మల్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గోన్నారు.డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాల ద్వారా పేదలకు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఉచితంగా అందుతాయి. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం . కాంగ్రెస్ ప్రభుత్వం విద్య వైద్యానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించిందని అన్నారు.పది సంవత్సరాలు బిఆర్ ఎస్ ప్రభుత్వం వైద్య రంగానికి 5950 కోట్లు ఖర్చు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఒక్క ఏడాది లో 11482 కోట్లు ఖర్చు చేసింది. 90 లక్షల కుటుంబాల కు 10 లక్షల వరకూ లబ్ధి చేకూర్చి వైద్యం అందించాము . గత ప్రభుత్వం గాలికి వదిలేస్తే రాజీవ్ ఆరోగ్య శ్రీ పెండింగ్ బిల్లులు అన్నీ క్లియర్ చేస్తున్నామని అన్నారు.రాష్ట్రం లో బిర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిన వైద్య రంగానాని గాడిన పెడుతున్నాము. బిఆర్ఎస్ ప్రభుత్వం లో నిర్లక్ష్యానిక గురైన విద్యా రంగానికి ప్రత్యేకం గా నిధులు కేటాయించాము. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం జరుగుతోంది. రాష్ట్రం లో రైతాంగానికి అండగా నిలిచి రుణమాఫీ చేశాము. నిరంతరాయంగా ఉచిత విద్యుత్ అందజేస్తున్నాము. ఖమ్మం జిల్లా లో సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు పూర్తి చేస్తున్నాం. 9 వేల కోట్లుతో రాజీవ్ యువ వికాసంతో యువత నిరుద్యోగులను ఆదుకుంటున్నామని అన్నారు.

# తల్లీతండ్రులను కోల్పోయిన పిల్లలకు జిల్లా యంత్రాంగం అండ

**హైదరాబాద్ పెన్ పవర్:** తల్లీ తండ్రిని కోల్పోయిన పిల్లలకు జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో తల్లి తండ్రినీ కోల్పోయిన పిల్లలు, వారి సం రక్షకులతో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పిల్లలు చదువుల్లో ముందుండాలని తెలిపారు. పిల్లలకు ఉన్న అన్ని సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని, ప్రతి నిత్యం ఐ. సి. పి.ఎస్ సిబ్బంది వారికి అందుబాటులో ఉంటారని జిల్లా కలెక్టర్ తెలిపారు. పిల్ల లందరూ వారి సమస్యలను తమకు వదిలేసి తమ చదువు తాము చదువుకోవాలని కోరారు. పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులతో వ్యక్తిగతంగా మాట్లాడి ఉన్నత చదువుల అవకాశాల గురించి కలెక్టర్ చర్చించారు. ప్రభుత్వం పిల్లల కోసం ప్రతి నెల తప్పనిసరిగా 4 వేల రూపాయల సహాయం ఇస్తుందని, పిల్లల సంరక్షకులు పిల్లలు రక్త సంబంధీకులు కాబట్టి వారిని సొంత బిడ్డలతో సమానంగా చూసుకోవాలని కలెక్టర్ కోరారు. పిల్లలు ఏదైనా సమస్య ఉంటే వెంటనే 1098 కి ఫోన్ చేసి చెపితే తమ సిబ్బంది వెంటనే స్పందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వేణు గోపాల్, జితేందర్, కనకరాజు, రజిత, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# సత్యవేడులో మంత్రి నారా లోకేష్ 62వ రోజు ప్రజాదర్బార్



**హైదరాబాద్ పెన్ పవర్:** కూటమి ప్రభుత్వ పాలనలో సామాన్యుల సమస్యల పరిష్కారమే ఏకైక అజెండాగా పనిచేస్తున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్.. తన తిరుపతి జిల్లా సత్యవేడు పర్యటనలో రెండో రోజు ఉదయం స్థానిక సంత ప్రాంగణంలో 62వ ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న వారినుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతి ఒక్కరిని స్వయంగా కలిసి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని భరోసా ఇచ్చారు. మంత్రి లోకేష్ రాకను పురస్కరించుకుని పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు.

# మిస్ వరల్డ్ పోటీలకు అంతా సిద్ధం



**హైదరాబాద్ పెన్ పవర్:** మిస్ వరల్డ్ పోటీల ప్రారంభోత్సవానికి సమయం దగ్గర పడింది. పదవ తేదీసాయంత్రం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీలు అధికారికంగా మొదలవుతాయి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం విస్తృత స్థాయిలో అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఎయిర్ పోర్టుతో సహా హైదరాబాద్ నగరాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తోంది. ఈ ఏర్పాట్లన్నీ దాదాపు తుదిదశకు చేరుకున్నాయి.
ప్రపంచం నలుమూలల నుంచి ఇప్పటికే 95 దేశాలకు చెందిన మిస్ వరల్డ్ పోటీ దారులు హైదరాబాద్ చేరుకున్నారు. మరికొంత మంది ప్రతినిధులు వివిధ దేశాల నుంచి రానున్న రెండు రోజుల్లో వస్తారని మిస్ వరల్డ్ నిర్వాహకులు తెలిపారు. వీరికి తోడు 28 మంది మిస్ వరల్డ్ సంస్థ నుంచి నిర్వహణ ప్రతినిధులు, 17 మంది సహాయకులు వచ్చారు. గత వారం రోజులుగా వస్తున్నఅతిథులు అందరినీ తెలంగాణ సంస్కృతీ, సాంప్రదాయాలకు అనుగుణంగా స్వాగతం పలుకుతూ వారికి బస ఏర్పాట్లను టూరిజం శాఖ కల్పించింది. విదేశీ ప్రతినిధులు బస చేసిన ట్రిడెంట్ హోటల్ దగ్గర పోలీసులు భారీ భద్రత కల్పించారు.ఇవాళ, రేపు ఈ కంటెస్టెంట్లు రిహార్సల్స్ కార్యక్రమాల్లో పాల్గొంటారు. పోటీదారులను వివిధ గ్రూపులుగా ఏర్పాటు చేసి వారు పాల్గొనబోయే కార్యక్రమాల బ్రీఫింగ్ నిర్వాహకులు చేస్తున్నారు.వివిధ దేశాలకు చెందిన కంటెస్టెంట్లు విభిన్న కార్యక్రమాలు, తెలంగాణలో ఉన్న చారిత్రక, పర్యాటక ప్రదేశాల సందర్శనలో పాల్గొంటారు. అలాగే బ్రెస్ట్ క్యాన్సర్ నివారణ, మహిళలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను కూడా మిస్ వరల్డ్ కంటెస్ట్ లో భాగంగా చేపడుతున్నారు.ఏర్పాట్లపై ఇప్పటకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సహా, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కార్పోరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఉన్నతాధికారులతో సమీక్షించారు. అవసరమైన సలహాలు, సూచనలు చేశారు.ప్రకృతి, పర్యావరణ పరంగా అన్నిహంగులు ఉన్నా, తెలంగాణ ఆరంగంలో వెనుకబడిందని, ఇకపై తెలంగాణ జరూర్ ఆనా (తప్పకుండా తెలంగాణ రండి, పర్యటించండి.) అనే నినాదాన్ని విస్తృతంగా ప్రపంచవ్యాప్తం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తద్వారా పర్యాటకరంగం పెరగటం, పెట్టుబడుల సాధన, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ఈవెంట్ గురించి రాష్ట్ర ప్రభుత్వం దేశ విదేశాలతో పాటు అన్ని రాష్ట్రాల ప్రధాన ఏర్పోర్ పోర్టుల్లో ప్రచారం కల్పిస్తుంది.ఇక వివిధ ప్రాంతాల్లో ఈ నెలాఖరు వరకు జరిగే కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాన్ని పరిమిత సంఖ్యలో సామాన్యులకూ కల్పించేందుకు వీలుగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. టూరిజం వెబ్ సైట్ లో రిజిస్టర్ (%https://tourism.telangana.gov.in/events-single/miss-world-event%) చేసుకున్న వారికి ఐదు కేంద్రాల్లో వేయి మందికి చొప్పున మొత్తం ఐదువేల మందికి మిస్ వరల్డ్ పోటీలను వీక్షించే అవకాశం కల్పించాలని భావిస్తున్నారు.

# ఓల్డ్ బస్తీలో...మిస్ వరల్డ్ ప్రతినిధుల హెరిటేజ్ వాక్



## చార్మినార్, లాడ్ బజార్ లకు గ్లోబల్ ఎక్స్పోజర్

**హైదరాబాద్ పెన్ పవర్:** ,హైదరాబాద్ లో నిర్వహించే మిస్ వరల్డ్ ఈవెంట్ తో చార్మినార్, లాడ్ బజార్ లకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు దక్కనుంది. మిస్ వరల్డ్ ఈవెంట్ లో భాగంగా ఈ నెల13 న సాయంత్రం హైదరాబాద్ నగరంలోని చార్మినార్ , లాడ్ బజార్ లలో హైదరాబాద్ తో పాటు చార్మినార్ , లాడ్ బజార్ సాంస్కృతిక వైభవాన్ని,వైవిధ్యాన్ని చారిత్రక ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజేసేలా హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నారు. లాడ్ బజార్ లో మిస్ వరల్డ్ ప్రతినిధులు స్థానిక కళాకారులతో మాట్లాడనున్నారు.
120 దేశాల మిస్ వరల్డ్ ప్రతినిధులు హాజరయ్యే.... ఈ హెరిటేజ్ వాక్ ను 150 కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం కానుంది. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు ఈ ఈవెంట్ ను తిలకిస్తారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని సీఎం శ్రీ రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా అధికార యంత్రాంగం పెద్ద ఎత్తున విదేశీ పర్యాటకులను తెలంగాణకు ఆకర్షించేలా ప్రణాళిలు సిద్ధం చేశారు. చారిత్రక చార్మినార్ కట్టడం, లాడ్ బజార్ ప్రత్యేకతలను మిస్ వరల్డ్ ప్రతినిధులు వివరించి వరల్డ్ టూరిస్ట్ డెస్టినేషన్ స్పాట్ గా ప్రమోట్ చేయనున్నారు.

**లాడ్ బజార్ ప్రత్యేకత**

నిజాం పాలనలో వెలసినలాడ్ బజార్ కు 400 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉంది. బాంగిల్స్ రాజధానిగా ఈ ప్రాంతం సుప్రసిద్ధం. రంగురంగుల పేర్లు, మణులు, జరీ పనితో కూడిన సాంప్రదాయిక గాజులు ఇక్కడి ప్రత్యేకత. ప్రతి పెళ్లి సీజన్లో ఇది జనాల ఆకర్షణకేంద్రం. ఇక్కడ నాణ్యమైన ముత్యాలు, నగలు సరసమైన ధరల్లో లభిస్తాయి.
హస్తకళల హబ్ గా కూడా పేరుంది. చిత్రకళ, నకాశీ పని, ఇస్లామిక్ ఆర్ట్ వంటి సాంప్రదాయిక హస్తశిల్ప వస్తువులు ఇక్కడ లభిస్తాయి. ఇత్తార్ (సువాసనలు), ఖురాన్ ప్రతులు, సాంస్కృతిక వస్తువులతో ఇది ఇస్లామిక్ ఆర్ట్ కి ప్రతీకగా ఉంది.
ఓల్డ్ సిటీ యొక్క ఇటుకల రోడ్లు, సజీవమైన దుకాణాలు, సాంస్కృతిక సువాసనలు ప్రతి ఒక్కరినీ ముగ్ధులను చేస్తాయి.

**చార్మినార్ ప్రత్యేకత**

1591లో కుతుబ్ షాహీ రాజు ముహమ్మద్ కులీ కుతుబ్ షా నిర్మించిన చార్మినార్, హైదరాబాద్ సాంస్కృతిక గర్వాన్ని ప్రతిబింబిస్తుంది. నాలుగు మినార్లతో కూడిన ఈ స్మారకం ఇండో–ఇస్లామిక్ డిజైన్ కు నిదర్శనం. ప్లేగు నివారణ తర్వాత నగర స్థాపనకు గుర్తుగా నిర్మించబడింది. 56 మీటర్ల ఎత్తు, 45 మీటర్ల వెడల్పుతో ఇది హైదరాబాద్ కు "హార్ట్" గా ఉంది.మినార్ల పై నుంచి పాత నగరం, మక్కా మసీదు అద్భుత దృశ్యాలు కనిపిస్తాయి.
ప్రపంచ వారసత్వ స్థలంగా గుర్తింపు కోసం ప్రతిపాదించబడింది. ఇది నిజాం కాలం నుంచి నేటి వరకు హైదరాబాద్ ఐకాన్ గా ఉంది

# అహోబిలం లోనవ కలశ తిరుమంజనం



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన అహోబిల క్షేత్రంలో వైశాఖ మాసాన్ని పురస్కరించుకొని వైశాఖమాస నృసింహ జయంతి బ్రహ్మోత్సవం 2025. ఈరోజు ఎగువ అహోబిలం లో నృసింహ జయంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జ్వాల నరసింహ స్వామికి నవ కలశ తిరుమంజనం నిర్వహించారు. వాసంతిక పరిణయోత్సవం ( తిరు కళ్యాణం) నిర్వహించారు ఈ కళ్యాణంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పట్టు వస్త్రాల సమర్పించి కళ్యాణానికి వచ్చిన చెంచు మహిళలు చెంచు కులం లో ఉన్నవారికి మరియు భక్తులకు దేవస్థానం తరపున వస్త్రాలు ఉచితంగా ఇచ్చారు

# తాజ్ కృష్ణలో ప్యాట్ కమిన్స్ సందడి

**హైదరాబాద్ పెన్ పవర్:** బంజారాహిల్స్ లోని తాజ్ కృష్ణ హోటల్లో సన్ రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ సందడి చేశారు. క్రరెరా కళ్ల జోళ్ల పరిశ్రమకు బ్రాండ్ అంబాసిడర్గా ఉన్న ఆయన ఆ సంస్థ సరికొత్త ఉత్పత్తులను ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ మాట్లాడుతూ క్రరెరాతో భాగస్వామ్యం చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. బ్రాండ్ అంబాసిడర్ గా సంవత్సరాన్ని పూర్తి చేసుకున్న తర్వాత క్రరెరా సరికొత్త ఉత్పత్తులను ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. విభిన్న స్టైల్స్, విభిన్న డిజైన్స్తో అందరినీ ఆకట్టుకనేలా కళ్లజోళ్లు, గాగుల్స్ను క్రరెరా తీసుకువస్తుందన్నారు. చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అల్బెర్టో మక్కియని మాట్లాడతూ ఇండియాలో 2025 మే నుంచి మూడు ఆప్టికల్ ఫ్రేమ్స్ ను, మూడు కొత్త సన్ గ్లాస్లను పరిచయం చేయడం జరిగిందన్నారు.

# ఎల్ జి ఎలక్ట్రానిక్స్ శ్రీసిటీ యూనిట్ కు మంత్రి నారా లోకేష్ భూమిపూజ

**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయస్థాయి గృహోపకరణాల తయారీ సంస్థ ఎల్ జి ఎలక్ట్రానిక్స్ శ్రీసిటీ యూనిట్ కు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.... మేం ఈరోజు ఎల్ జి యూనిట్ కు మాత్రమే కాదు – ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం కొత్త పునాదులు వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ జి ఎలక్ట్రానిక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ హాంగ్ జు జియోన్, భారత్ లో కొరియన్ రిపబ్లిక్ రాయబారి లీ సియాంగ్ హో, ఎల్ జి ఎలక్ట్రానిక్స్ హోం సొల్యూషన్స్ సిఈఓ జేచియోల్ లియు, ఎకో సొల్యూషన్స్ సిఈఓ జే సంగ్ లీ, సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డి, జిల్లాపరిషత్ చైర్మన్ జి. శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్ రెడ్డి, గాలి భాను ప్రకాష్, పులివర్తి నాని, కోనేటి ఆదిమూలం, ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్ సెక్రటరీ కాటంనేని భాస్కర్, కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏపీఐఐసి వైస్ చైర్మన్ అభిషిక్త్ కిషోర్, కాన్సులేట్ జనరల్ (ఏపీ, తెలంగాణా) చుక్కపల్లి సురేష్ పాల్గొన్నారు.

# లెప్రసీ గలవారికి ఉచితంగా పాదరక్షల పంపిణీ

**చాగలమర్రి: పెన్ పవర్:** చాగలమరి మండలంలోని చాగలమర్రి, పెద్ద వంగలి, మద్దూరు గ్రామాలలో లెప్రసీ పాత కేసుల గల వారికీ కాళ్లకు స్పర్శ లేకపోవడం వల్ల వారి కాళ్లకు పుండ్లు అనేవి ఏర్పడతాయి. అవి రాకుండా ప్రభుత్వం చే మైక్రో సెల్యులర్ రబ్బర్ చెప్పులు సంవత్సరానికి రెండు జతలు చొప్పున ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుంది. ఇందులో భాగంగా నంద్యాల జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ మరియు టీబీ ఆఫీసర్ ద్వారా నలుగురు వ్యక్తులకు ఉచితంగా చాగలమర్రి ప్రభుత్వ వైద్యాధికారి ఇమ్రాన్ చేతుల మీదుగా పాదరక్షలను అందించడం జరిగింది.ఈ చెప్పులను ధరించడం వల్ల లెప్రసీ కేసులు గల వారికి కాళ్లకు పుండ్లు రాకుండా జరుగుతుంది. మరియు చెప్పులకు బెల్టులు ఉండడం వల్ల కాళ్లకు చెప్పులు జారిపోకుండా ఉంటాయి.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ రామలింగారెడ్డి పాల్గొనడం జరిగింది.

# ఎన్టీఆర్ జిల్లా వైసీపీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

**వైసీపీ ఐటీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షులు నల్లమోతు ప్రసన్న బోస్ డిమాండ్**

**ఇబ్రహీంపట్నం పెన్ పవర్:** మైలవరం నియోజకవర్గంలో మాజీ మంత్రి జోగి రమేష్ లేకపోతే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లేదని జగన్మోహన్ రెడ్డి నాయకత్వాన్ని కించపరుస్తూ మాట్లాడిన వైసీపీ జిల్లా కార్యదర్శి ఉయ్యూరు శ్రీనివాసరెడ్డిపై క్రమశిక్షణ సంఘం చర్యలు తీసుకోవాలి ఈ వ్యాఖ్యలను వైసీపీ నాయకులు, జగన్ అభిమానులు ఖండించాలని వైసీపీ ఐటీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షులు నల్లమోతు ప్రసన్న బోస్ డిమాండ్ చేసారు. వైసీపీలో గెలిచి టీడీపీకి నాయకత్వం వహిస్తున్న మండల స్థాయి ప్రజాప్రతినిధి పదవిపై అవిశ్వాసం పెట్టి పూర్తి స్థాయి మెజారిటీ ఉన్న వైసీపీ శ్రేణులకు కేటాయించాలి. 2014, 2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి గెలుపు కోసం పనిచేసిన పార్టీ సీనియర్ నాయకులను గుర్తించి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలి.
మైలవరం నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి బలమైన ఓటు బ్యాంకు కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాల దీర్ఘకాలిక సమస్యలు పెండింగ్ లో ఉన్నప్పటికీ ఆ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడంతో వైసీపీ శ్రేణులు టిడిపి నాయకుల దగ్గరకు వెళుతున్నారు. దీంతో వైసిపి బలహీనపడే అవకాశం ఉంది. దీనిపై అధిష్టానం చర్యలు తీసుకోవాలి.
వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళితే పని చేయవద్దని చెప్పే టీడీపీ నాయకులతో వైసీపీ సమన్వయకర్త చెట్టాపట్టాలేసుకుని తిరిగితే వైసీపీ శ్రేణులకు ఎలాంటి సంకేతం ఇచ్చినట్లు? దీనిపై అధిష్ఠానం దృష్టి సారించాలని అన్నారు.
నియోజకవర్గంలో వైసీపీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి ఉంది నియోజకవర్గంలో సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో అధిష్ఠానం మాట్లాడితే చాలా విషయాలు తెలుసుకునే అవకాశం ఉంది. దీనిపై నియోజకవర్గ సమన్వయకర్త, జిల్లా అధ్యక్షుడు, రీజనల్ కో – ఆర్డినేటర్, అధిష్ఠానం దృష్టి సారించి నియోజకవర్గ పార్టీ పునర్ వైభవానికి చర్యలు తీసుకోవాలని అన్నారు.

## ఉత్తరాఖండ్ లో హెలికాప్టర్ ప్రమాదం..

**ఆరుమంతి మృతి.. ఏపీ వాసులు ఇద్దరు మృతి ...**

**టీడీపీ ఎంపీ కుటుంబ సభ్యులు..**

**విషాదంలో ఎంపీ కుటుంబం**

**న్యూఢిల్లీ: పెన్ పవర్:** ఉత్తరాఖండ్లో ఘోర హెలికాప్టర్ ప్రమాదం జరిగింది. ఉత్తరకాశీలో గంగోత్రి వైపు పర్యాటకులతో వెళ్తున్న ప్రైవేట్ హెలికాప్టర్ కుప్పకూలి ఆరుగురు మృతి చెందారు. మృతుల్లో అనంతపురం టీడీపీ ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు ఉన్నారు. ఆయన సోదరి వేదవతి కుమారి (48)మృతి చెందగా, బావ భాస్కర్ (51)తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన భాస్కర్ ను ఎయిమ్స్ రిషికేష్ కు తరలించారు. ప్రమాద వార్త తెలియగానే ఎంపి లక్ష్మీ నారాయణ రుషికేశ్ బయలుదేరారు. ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు, విచారణకు ఆదేశించారు. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా చెబుతున్నారు

## కబ్జాదారుల నుంచి స్మశాన వాటిక స్థలంను కాపాడండి...

**- తహసీల్దార్ కు వినతి అందించిన ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గుండు పోగుల నేపాల్**

**హైదరాబాద్ పెన్ పవర్:** కడివెళ్ళ గ్రామంలోని కబ్జాదారుల నుంచి మాదిగల స్మశాన వాటిక స్థలంను కాపాడండిని బీఎస్పీ పార్టీ నాయకులు ప్రసాద్, ఏపీ ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ రవి ల ఆధ్వర్యంలో తహసీల్దార్ శేషఫణి కు వినతి అందించిన ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గుండు పోగుల నేపాల్. ఈ సందర్భంగా ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గుండు పోగుల నేపాల్ మాట్లాడుతూ అనేక సంవత్సరముల నుండి మాదిగలకు స్మశానవాటిక నిమిత్తమై స్థలంను గత అనేక సంవత్సరములకు పూర్వం నుండి స్మశానవాటిక స్థలంను మాధిగలకై ఏర్పరచబడి వున్నది. ఈ యొక్క స్మశాన వాటిక స్థలంను కొందరు బి.సి కులమునకు చెందినవారు దౌర్జన్యంతో కబ్జాచేసినందుకు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. దళితులు, మాదిగలు అనే చులకన భావంతోనే మాకు సంబంధించిన స్థలాలను ఆక్రమించెందుకు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి న్యాయం చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ మండల నాయకులు ఏకలవ్య, ఇసాక్, యాకోబు, సునీల్, జయన్న, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పొరపాట్లకు తావు లేకుండా రీసర్వేను నిర్వహించండి: తహసిల్దార్ పురుషోత్తముడు

**హైదరాబాద్ పెన్ పవర్:** సి.బెళగల్ మండలంలోని బ్రాహ్మణ దొడ్డి రెవెన్యూ పరిధిలో నిర్వహిస్తున్న రీ సర్వే ను గురువారం తహసిల్దార్ పురుషోత్తముడు తనిఖీ చేశారు. సర్వే నంబర్ 103 లో 5వ బృందం సభ్యులు నిర్వహిస్తున్న రీసర్వేను పరిశీలించి రీ సర్వే బృందాలకు పలు సూచనలు తెలిపారు. బ్రాహ్మణ దొడ్డి రెవెన్యూ పరిధిలో మొత్తం 7522ఎకరాల 23 సెంట్లు భూమి కలదని, రీ సర్వేకు మొత్తం ఆరు బ్లాకులుగా విభజించామని, ఒక్కొక్క బ్లాక్ కు 170 ఎకరాల భూమిని కేటాయించామని తెలిపారు. అలాగే బ్రాహ్మణ దొడ్డి రెవెన్యూ పరిధిలో మొత్తం 698/2 సర్వే నంబర్లు ఉన్నాయని తెలిపారు. వీటి కొరకు 5487 నంబర్లు ఉన్నాయని తెలిపారు. అలాగే రీ సర్వే నిర్వహించే ప్రదేశాల్లో ఒకరోజు ముందుగానే రైతులకు ఫోన్ ద్వారా గాని, వాట్సాప్ ద్వారా గాని సమాచారాన్ని అందించాలని, రైతు సమ్మతితోనే రీసర్వెను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. రీ సర్వేలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ప్రతిష్టమైన ప్రణాళికతో రీ సర్వేను నిర్వహించాలని తెలిపారు. అనంతరం సర్వే నంబర్ 103లో పూజా కార్యక్రమాలు నిర్వహించి రీ సర్వే ను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్లు నాగభూషణం, వీఆర్వోలు శేఖరు, రంగముని, మంజీర, గ్రామ సర్వేయర్లు రాజశేఖర్, మరియు గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు

## గ్రంథాలయంలో విద్యార్థులకు నృత్యం పోటీలు




**హైదరాబాద్ పెన్ పవర్:** మండల కేంద్రం శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిని శెట్టి. సునీత ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు నృత్యం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిని సునీత మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో కూడా ముందంజ ఉండాలని ఆమె చెప్పారు. ప్రధానంగా విద్యార్థులకు తల్లితండ్రులు ప్రోత్సహించి గ్రంథాలయాల్లో పంపేందుకు శ్రద్ధ వహించాలని ఆమె కోరారు. నిర్వహించిన నృత్యం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేస్తామని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ సిబ్బంది సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణ కార్యక్రమం

**హైదరాబాద్ పెన్ పవర్:** చాగలమరి పట్టణంలోని కస్తూర్బా మరియు ఎస్సీ గర్ల్స్ హాస్టల్ నందు ఆళ్లగడ్డ సబ్ యూనిట్ ఆఫీసర్ శివచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు దోమల నివారణలో భాగంగా ఆల్ఫా సై ఫర్ మైత్రిన్ -5% మందును పిచికారి చేయించడం జరిగింది. రానున్న వర్షాకాలం దృశ్య దోమలను అరికట్టేందుకు ఈ మందును పిచికారి చేయడం వల్ల దోమల వృద్ధి అనేది ఈ మందు అరికడుతుందని ఈ మందు ప్రభావం ఆరు నెలల వరకు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా యస్ఓ సునీత, హెల్త్ సూపర్వైజర్ రామలింగారెడ్డి,హెల్త్ అసిస్టెంట్ మనోహర్,రాముడు, సిహెచ్ గార్లేట్, లీలావతి దేవి, పుష్పలత మరియు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ మానం గురవయ్యను పరామర్శించిన దారపనేని

**కనిగిరి: పెన్ పవర్:** కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు మాజీ సర్పంచ్, తూర్పు కోడిగుడ్లపాడు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మానం గురవయ్యను గురువారం కనిగిరి మాజీ ఏఎంసి చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పరామర్శించారు. ఇటీవల కొంత అస్వస్థతకు గురైన గురవయ్య విజయవాడలోని కార్పొరేట్ వైద్యశాలలో మెరుగైన వైద్యం చేయించుకుని సంపూర్ణ ఆరోగ్యంతో స్వగ్రామానికి తిరిగి వచ్చారు. దారపనేని, మానం గురవయ్య స్వగృహానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి పై సమాచారం అడిగి తెలుసుకుని ఆరోగ్యంపై అశ్రద్ధ విడనాడి ఆరోగ్యవంతులుగా ఉండేందుకు కృషి చేయాలని సూచించారు. మిరియం సుబ్బరాయుడు, దారపనేని నరసింహారావు, మానం వెంగళరావు, బొడ్డు రవి, నాగం నాగరాజు తదితరులు మానం గురవయ్యను పరామర్శించిన వారిలో ఉన్నారు.

## తెలంగాణ రాష్ట్రానికి ఎనలేని సేవలు చేసిన పొన్నం...

**ఎన్ఎస్ యుఐ నాయకులు ఎండి ఇమ్రాన్..**

**జమ్మికుంట పెన్ పవర్:** గురువారం రోజున తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన రోజు సందర్భంగా జమ్మికుంట మండలంలోని బిజీగిరిశరీఫ్ దర్గా లో ప్రత్యేక ప్రార్థనలు చేసి దర్గా లో చాదర్ లు సమర్పించడం జరిగింది మరియు దర్గా ఆవరణలో అల్పాహారం పంపిణీ చేసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేశారు...



అనంతరం ఇమ్రాన్ మాట్లాడుతూ ఎస్ ఆర్ ఆర్ కళాశాలలో ఎన్ ఎస్ యు ఐ, అధ్యక్షుడిగా మొదలైన తన రాజకీయ జీవితం ఆ తర్వాత ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎన్ ఎస్ యు ఐ ప్రధాన కార్యదర్శిగా, జిల్లా అధ్యక్షుడిగా, ఆ తర్వాత రాష్ట్ర అధ్యక్షుడిగా మరియు జాతీయ ప్రధాన కార్యదర్శిగా,మార్కెట్ కమిటీ చైర్మన్ గా ఆ తర్వాత కరీంనగర్ జిల్లా పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికయ్యారని.అదే విధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పార్లమెంటు బిసి ఫోరం అధ్యక్షుడిగా తరువాత తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా సేవలు అందించారని.. ఆ తర్వాత 2023 లో జరిగిన ఎన్నికల్లో హుస్నాబాద్ నియోజకవర్గ శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారని.మరియు వారి సేవలను గుర్తించి కాంగ్రెస్ పార్టీ పొన్నం ప్రభాకర్ కు రాష్ట్ర రవాణాశాఖ మంత్రిగా మంత్రివర్గంలో అవకాశం ఇచ్చిందని. ఎన్ ఎస్ యు ఐ నుండి మొదలైన పొన్నం ప్రభాకర్ ప్రస్థానం విద్యార్థి దశ నుండి విద్యార్థుల కోసం అనునిత్యం కొట్లాడి ఆనాటి దివంగత నేత వైయస్ రాజశేఖర రెడ్డి ని ఒప్పించి ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ చేసిన ఘనత పొన్నం ప్రభాకర్ ది అని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్గా ఉన్నప్పుడు రైతుల పక్షాన కొట్లాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించిన ఘనత పొన్నం ప్రభాకర్ ది అని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎన్ఎస్ యుఐ, జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ ఇమ్రాన్, మాజీ ఎన్ ఎస్ యు ఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి అజ్మత్, హుజూరాబాద్ నాయకులు మహమ్మద్ జియఉల్ అలీ, అలీశరీఫ్, చరణ్, దినేష్, యశ్వంత్, సురేష్, మహేష్, అనిల్, రాజేష్, నరేందర్, శ్రావణ్, అమీర్, మణిశ్, సిద్ధు,నరేష్, మధు మరియు 20 మంది యువకులు పాల్గొన్నారు..

## నకిలీ విత్తనాల రవాణా విక్రయాలపై ప్రత్యేక నిఘా

**హైదరాబాద్ పెన్ పవర్:** నకిలీ విత్తనాలను అరికట్టేందుకు పోలీస్ కమిషనరేట్ లో టాస్క్ ఫోర్స్ టీమ్స్ ఏర్పాటుఅనుమానం వచ్చిన విత్తనాల శాంపిల్స్ వెంటనే పరీక్షనకిలీ విత్తనాలతో రైతులను మోసం చేయాలని చూస్తే సహించం.నకిలీ విత్తన అక్రమార్కులపై పీడియాక్ట్ అమలు చేస్తామనిపోలీస్ కమీషనర్ డాక్టర్ బి. అనురాధ అన్నారు..ధనార్జనే ధ్యేయంగా కొంతమంది అక్రమార్కులు ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల విత్తనాల పేరుతో నకిలీ విత్తనాలు, కొన్ని కంపెనీలు కాలం చెల్లిన విత్తనాలను రీసైక్లింగ్ చేసి కొత్త విత్తనాలు అని చెప్పి రైతులకు అమ్మడం తీరా అవి సరైన దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారు. రైతులు నకిలీ, కల్తీ విత్తన ముఠాల బారిన పడకుండా మేలు రకం విత్తనాలు విక్రయించే విధంగా నకిలీ, కల్తీ విత్తనాలు స్మగ్లింగ్ పై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ ఆదేశాల మేరకు నకిలీ విత్తనాలను అరికట్టేందుకు సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో పోలీసు అధికారులు అప్రమత్తతో సమాచారాన్ని సేకరించి కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని తెలిపారు. వానాకాలం సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్న సమయంలో నకిలీ విత్తనాలను విక్రయించేందుకు కొందరు ప్రయత్నాలు చేయడం జరుగుతుంది. వారిని అరికట్టడం లో భాగంగా వ్యవసాయశాఖ, టాస్క్ ఫోర్స్, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందితో కలిసి సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ బృందాలు




రైతులను మోసం చేసే, నకిలీ విత్తనాలను సరఫరా చేసే వారిని గుర్తించి వారిపై గతంలో కేసులు నమోదైన వారిపై నిఘా ఏర్పాటు చేసి సమాచారం సేకరించి వారిపై కఠినంగా చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సిద్దిపేట జిల్లా పరిధిలో విత్తన, ఎరువుల దుకాణాలను, గోడౌన్లను ఆకస్మికంగా తనిఖీలు, అనుమానం వచ్చిన విత్తనాల శాంపిల్స్ వెంటనే పరీక్షలకు పంపించడం, రవాణా వాహనాలను కూడా ఆకస్మిక తనిఖీలు చేయడం జరుగుతుంది. లైసెన్స్ లు లేకుండా వ్యాపారం చేసే వారిపై, నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కూడా కేసులు నమోదు చేయాలని అధికారులకు ఆదేశాల జారీ చేయడం జరిగింది. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు ప్రభుత్వ అనుమతి పొందిన సంస్థల నుంచి విత్తనాలను వినియోగించేలా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. నకిలీ విత్తనాలు ఇతర రాష్ట్రాల నుంచి రాకుండా సరిహద్దు ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అక్రమ రవాణాను జరిగే ప్రాంతాలు, మార్గాలను గుర్తించి ఆకస్మిక తనిఖీలు చేయడంతోపాటు నకిలీ, కల్తీ విత్తనాల అక్రమ రవాణాను, సరఫరా నిరోధించేందుకు ఇన్ఫార్మర్ వ్యవస్థను పటిష్టం చేయడం జరిగిందిని నకిలీ విత్తన అక్రమార్కులపై పీడియాక్ట్ అమలు చేయడానికి వెనుకడుగు వేయమని హెచ్చరించారు.

నకిలీ విత్తనాలు కలిగి ఉన్న రైతులకు అమ్మడానికి ఎవరైనా ప్రయత్నించిన వెంటనే డయల్ 100, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712667100 సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు.

## ఏపిని ఎలక్ట్రానిక్స్ పవర్ హౌస్ గా మార్చేందుకు ప్రజా ప్రభుత్వం బాటలు

- **మేడ్ ఇన్ ఆంధ్ర నుండి మేడ్ ఫర్ ది వరల్డ్ వరకు జైత్రయాత్ర కొనసాగుతుంది**
- **స్థానిక ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపనున్న ఎల్ జి యూనిట్**
- **రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడ్డాక తొలి ఎఫ్ డిఐ శ్రీసిటీ**
- **ఎల్ జి యూనిట్**
- **స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తో ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా ఎపి**
- **ఎల్ జి శ్రీసిటీ యూనిట్ కు రాష్ట విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్ భూమిపూజ**

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో సృష్టించబడే ప్రతి ఉద్యోగం, ఆవిష్కరణ ద్వారా ఆంధ్రప్రదేశ్ ను ఎలక్ట్రానిక్ పవర్ హౌస్ గా మార్చేందుకు బాటలు వేస్తున్నామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. అంతర్జాతీయస్థాయి గృహోపకరణాల తయారీ సంస్థ ఎల్ జి ఎలక్ట్రానిక్స్ శ్రీసిటీ యూనిట్ కు లోకేష్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.... మేం ఈరోజు ఎల్ జి యూనిట్ కు మాత్రమే కాదు - ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం కొత్త పునాదులు వేస్తున్నాం. ఈ కార్యక్రమం ఒక నిర్మాణ ప్రాజెక్టు ప్రారంభం కంటే పెద్దది. ఇది మన రాష్ట్రంతోపాటు భారతదేశ పారిశ్రామిక వృద్ధి, సాంకేతిక పురోగతిలో ఒక మైలురాయి. ఆవిష్కరణ పెట్టుబడిని కలిసే చోట, భవిష్యత్తు రూపుదిద్దుకుంటుంది. ?5,000 కోట్లకు పైగా పెట్టుబడితో %ూ+% ఎలక్ట్రానిక్స్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రపంచ స్థాయి తయారీ యూనిట్‌ను తీసుకురావడమే గాక ఎపిని పెట్టుబడుల గమ్యస్థానంగా ప్రపంచ విశ్వాసాన్ని పునరుద్ధాటిస్తోంది. మేడ్ ఇన్ ఆంధ్ర నుండి మేడ్ ఫర్ ది వరల్డ్ వరకు మా జైత్రయాత్ర కొనసాగుతుంది. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి ప్రధాన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో ఒకటిగా ఎల్ జి శ్రీసిటీ యూనిట్ ఆవిష్కృతమైంది.

**పారిశ్రామిక రంగంలో వేగం, బలమైన మౌలిక సదుపాయాలు...**

ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుపై చంద్రబాబునాయుడు గారి నిబద్ధతకు ఇది అద్దం పడుతోంది. మేము సులభతరమైన వ్యాపారానికి హామీ ఇవ్వడమేగాక స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను అనుసరిస్తున్నాం. శ్రీసిటీలో %ూ+% ఎలక్ట్రానిక్స్ అత్యాధునిక తయారీ కర్మాగారానికి శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా మీ ముందుకు రావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. %ూ+% ఎలక్ట్రానిక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ హాంగ్ జు జియోన్, %ూ+%, దాని విక్రేత కంపెనీల నాయకత్వ బృందాలు, భాగస్వాములందరికీ నేను హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నాను.

**మేము రాష్ట్ర భవిష్యత్తును నిర్మిస్తున్నాం!**

%ూ+% ఫ్యాక్టరీ అధునాతన గృహోపకరణాలైన రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండిషనర్లు, వాషింగ్ మెషీన్లు స్మార్ట్, ఇంధన -సమర్థవంతమైన సాంకేతికతతో ఉత్పత్తులను అందిస్తుంది. ఒక స్మార్ట్ ఫ్యాక్టరీ, ఒక స్మార్ట్ రాష్ట్రం, ఒక స్మార్ట్ దేశం యొక్క సరికొత్త ప్రయాణం ఈరోజు ప్రారంభమవుతుంది. ఇది కేవలం తయారీ గురించి కాదుఇది జీవన భవిష్యత్తును రూపొందించడం గురించి. ఇది ఉద్యోగాలను సృష్టించడం, మన యువతకు సాధికారత కల్పించడం, జీవితాలను మార్చడం గురించి. మేము కేవలం కర్మాగారాలను నిర్మించడం లేదుబీ మేము రాష్ట్ర భవిష్యత్తును నిర్మిస్తున్నాం. ఎల్ జి ప్రధాన యూనిట్ దాదాపు 1,500 ప్రత్యక్ష ఉద్యోగాలను సృష్టిస్తుంది. %ూ+% ముఖ్య విక్రేతలు అదనంగా ?839 కోట్లు పెట్టుబడి పెట్టడం ద్వారా మరో 690 కి పైగా ఉపాధి అవకాశాలను కల్పిస్తారు. ఇది స్థానిక ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన భారీ ప్రభావాన్ని చూపుతుంది. ఇది కంపెనీకి ఒక కొత్త ఆవిష్కరణ కంటే ఆంధ్రప్రదేశ్ యువతకు కలల సాకార క్షణం. %ూ+% సప్లయ్ చైన్ ను మరింత బలోపేతం చేయడమేగాక దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించే హైటెక్ యూనిట్. ఎల్ జి నాలుగు కీలక విక్రేత భాగస్వాములైన ఏకోరియా, కురోడా ఎలక్ట్రిక్, హేంగ్ సంగ్ ఇండియా, క్యుంగ్‌సంగ్ ప్రెసిషన్ అండ్ టేసంగ్ ఎలక్ట్రానిక్స్ భాగస్వామ్య శక్తి పురోగతికి పాస్‌పోర్ట్ లాంటివి. ఇది వారి ఉమ్మడి సహకార వృద్ధి శక్తిని చాటడమేగాక ప్రపంచ ఎలక్ట్రానిక్స్ తయారీ పర్యావరణ వ్యవస్థగా ఆంధ్రప్రదేశ్ తనను తాను ఎలా నిలబెట్టుకుంటుందో కూడా ప్రపంచానికి చూపిస్తుంది.

**వాణిజ్యానికి ఎపి గేట్లు తెరిచే ఉన్నాయ్!**

ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాలు ఆంధ్ర ఆశయాన్ని నెరవేర్చినప్పుడు మాయాజాలం జరుగుతుంది. %ూ+% సంస్థ, దాని భాగస్వాములు కలిసి భారతీయ గడ్డపై %ూ×%-ఆధారిత తయారీ, స్మార్ట్ ఉత్పత్తి ప్రక్రియలు, ఎనర్జీ ఎఫిషియంట్ విధానాలు, అత్యాధునిక సాంకేతికతలను తీసుకువస్తున్నారు. ఎలక్ట్రానిక్స్ తయారీకి ప్రపంచస్థాయి కేంద్రంగా ఎపిని మార్చాలనే మా ఆశయాన్ని ఎల్ జి సంస్థ ముందుకు తీసుకెళ్తోంది. శ్రీ సిటీ పారిశ్రామిక పురోగతికి ఒక చుక్కానిలా మారింది. ఇలాంటి ప్రాజెక్టులతో మేము మేము ఎపి భవిష్యత్తును నిర్మిస్తున్నాం, స్మార్ట్ ఉద్యోగాలను సృష్టిస్తున్నాం, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తున్నాం. భూసేకరణ, నిర్మాణం నుండి పూర్తి స్థాయి ఉత్పత్తి వరకు - ఈ ప్రాజెక్టు ప్రతి దశలోనూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున మా నిరంతర మద్దతు అందిస్తాం. ఆంధ్రప్రదేశ్ లో పారిశ్రామికాభివృద్ధికి, అధునాతన ఆవిష్కరణలకు అవసరమైన వాతావరణాన్ని కల్పించడానికి మేం కట్టుబడి ఉన్నాం. ఎంతో నమ్మకంతో ఆంధ్రప్రదేశ్ ప్రజలు మాకు 94% మెజారిటీతో మ్యాండేడ్ ఇచ్చారు. ఉద్యోగాల కల్పనకు యువత మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది.

**ఎయిర్ పోర్టుకు డైరెక్ట్ కనెక్టివిటీ ఇస్తాం**

ఎల్జి యూనిట్ నిర్మాణానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తాం, ఇక్కడ అనుబంధ యూనిట్లతోపాటు ఎల్జి సిటీ నిర్మించండి. రాబోయే నాలుగేళ్లలో శ్రీ సిటీకి తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం తో డైరెక్ట్ కనెక్టివిటీ కల్పిస్తాం.ఆంధ్రప్రదేశ్ వాణిజ్యానికి తమ ద్వారాలను తెరిచే ఉంటుంది, సరికొత్త ఆవిష్కరణల కోసం, మార్పుకోసం ఆతృతగా ఎదురుచూస్తోంది. పరస్పర విశ్వాసం, ఉమ్మడి శ్రేయస్సు, ప్రపంచాన్ని అనుసంధానించే సమిష్టి లక్ష్యంతో కూడిన ఈ భాగస్వామ్యాన్ని మనం కొనసాగిద్దాం. ఒక ప్రతిష్టాత్మకమైన యూనిట్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ను ఎంచుకున్న ఎల్ జి ఎలక్ట్రానిక్స్ కు ధన్యవాదాలు. ఎల్ జి ఫ్యాక్టరీ ప్రతి యువ ఇంజనీర్, ప్రతి ఆశావహ సాంకేతిక నిపుణుడు, ప్రతి వ్యవస్థాపకుడికి కలల కర్మాగారంగా మారబోతోంది. మనం కలసికట్టుగా యంత్రాలు ఏర్పాటు చేసుకోవడం, ఉత్పత్తులను సాధించడమేగాక అవకాశాలను నిర్మించుకుందామని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

భారత్ లో కొరియా రాయబారి లీ సియాంగ్ హూ మాట్లాడుతూ... గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారి సహకారంతో ఆంధ్రప్రదేశ్లో తమ దేశానికి చెందిన కియా కంపెనీ ఏర్పాటైంది, ఇప్పుడు ఎల్జి వస్తోంది. రాష్ట్రంలో పారిశ్రమల ఏర్పాటుకు అన్నివిధాల సహాయ, సహకారాలు అందిస్తున్న చంద్రబాబు నాయుడు గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో %ూ+% ఎలక్ట్రానిక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ హాంగ్ జు జియోన్, భారత్ లో కొరియన్ రిపబ్లిక్ రాయబారి లీ సియాంగ్ హో, %ూ+% ఎలక్ట్రానిక్స్ హోం సొల్యూషన్స్ సిఈఓ జేచియోల్ లియు, ఎకో సొల్యూషన్స్ సిఈఓ జే సంగ్ లీ, సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డి, జిల్లాపరిషత్ చైర్మన్ జి. శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్ రెడ్డి, గాలి భాను ప్రకాష్, పులివర్తి నాని, కోనేటి ఆదిమూలం, ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్ సెక్రటరీ కాటంనేని భాస్కర్, కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏపీఐఐసి వైస్ చైర్మన్ అభిషిక్త్ కిషోర్, కాన్సులేట్ జనరల్ (ఏపీ, తెలంగాణా) చుక్కపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సురేపల్లి సుజాతను అరెస్టు చేయాలి

**కరీంనగర్ పెన్ పవర్:** ఆపరేషన్ సిందూర్ పై అనుచిత పోస్ట్ పెట్టిన శతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సురేపల్లి సుజాతను సస్పెండ్ చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ యూనివర్సిటీ అధికారులకు బీజేపీ నేతలు పిర్యాదు చేసారు. దేశ భద్రతను, ఆర్మీనీ కించపరుస్తూ సోషల్ మీడియాలో సురేపల్లి సుజాత పోస్ట్ పెట్టిన విషయం తెలిసిందే. ఆమెను తక్షణమే సస్పెండ్ చేసి అరెస్ట్ చేయాలని బీజేపీ మహిళ నేతల ఆందోళన. శతవాహన యూనివర్సిటీ ముందు దిష్టి బొమ్మ దగ్ధం చేసారు. ..

## 2027లో పాదయాత్ర చేస్తా : వైఎస్ జగన్

**విజయవాడ పెన్ పవర్:** 2027లో తాను మళ్లీ పాదయాత్ర చేస్తానని వైసీపీ అధినేత వైఎస్ జగన్ తెలిపారు. పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలు, లోక్సభ నియోజకవర్గాల పర్యవేక్షకుల భేటీలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకొచ్చే అవకాశం లేదు. వచ్చే ఏడాది పార్టీ ప్లీనరీని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్నాం. ప్లీనరీలోనే పాదయాత్రతో పాటు పార్టీ రాజకీయ వ్యూహ నిర్ణయాలను ప్రకటిస్తాం" అని జగన్ పేర్కొన్నారు.



## జగన్ వ్యక్తిగత కార్యదర్శి, సాక్షి ఎడిటర్ నివాసాల్లో సిట్ సోదాలు

**విజయవాడ పెన్ పవర్:** మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి పర్సనల్ సెక్రెటరీ నాగేశ్వర రెడ్డి, సాక్షి ఎడిటర్ ధనుంజయ్ రెడ్డి ఇంట్లో సిట్ సోదాలు జరిపింది. గురువారం ఉదయం 7 గంటల నుంచి 11.30 వరకు జరిగిన సోదాలు చేసింది. మర్వోట్కపు. లిక్కర్ స్కాం కేసు నిందితులు ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, గోవిందప్పల కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది. బుధవారం నాడు లిక్కర్ స్కాం కేసులో ధనుంజయ్ రెడ్డి కృష్ణమోహన్ రెడ్డి గోవిందప్ప ల బెయిల్ పిటిషన్ ను హైకోర్టు డిస్మిస్ చేసింది. బెయిల్ డిస్మిస్ చేయడంతో పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

## రూ.5 లక్షలు కట్టాలని కే ఏ పాల్ కు హైకోర్టు సూచన

**విజయవాడ పెన్ పవర్::** పాస్టర్ ప్రవీణ్ మృతి కేసు విషయంలో ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కే ఏ పాల్ కు హైకోర్టు షాక్ ఇచ్చింది. ఆయన దాఖలు చేసిన పిల్ ను హైకోర్టు విచారించింది. ఆ కేసును సిబిఐ తో విచారణ జరిపించాలని పిల్ లో పాల్ కోరారు. ఆ వ్యాజ్యాన్ని ఆయన సదుద్దేశంతోనే దాఖలు చేశారన్న రుజువు కోసం కోర్టు రిజిస్ట్రీ వద్ద రూ. 5లక్షలు కట్టాలని సూచించింది. ఆ సొమ్ము చెల్లించిన తర్వాతే విచారణ ప్రారంభిస్తామని స్పష్టం చేసింది. తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.



## మంత్రాలయంలో తప్పిన పెను ప్రమాదం కూలిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్..

మంత్రాలయంలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ కూలిపోయింది. అదృష్టవశాత్తు జనం ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. 40 వేల లీటర్ల సామర్థ్యం తో ఓవర్ హెడ్ ట్యాంక్ ను నిర్మించారు. ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించారు. ట్యాంక్ నాణ్యత ప్రమాణాలపై నివేదిక ఇవ్వాలని అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు.



## కూకట్ పల్లి పోలీసు స్టేషన్ దగ్గర చలివేంద్రం

**కూకట్ పల్లి: పెన్ పవర్:** సైబరాబాద్ కమిషనర్ ఆదేశాల మేరకు వేసవిని దృష్టిలో పెట్టుకుని బాలానగర్ డివిజన్ లో తాగునీటి అవసరాలను తీర్చేందుకు పోలీస్శాఖ, ఎన్జీవోల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు డీసీపీ సురేష్ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా స్వచ్ఛవేద ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో తీవ్ర ఉష్ణోగ్రతలు పెరుగుతున్న వేళ ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. బాలానగర్ డివిజన్ పరిధిలోని అని పోలీస్ స్టేషన్ ల దగ్గర స్వచ్ఛమైన నీటిని అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, సీఐ రాజేష్, ఎస్సైలు, స్వచ్ఛవేద ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు...

## మాజీ ఎమ్మెల్యే భర్త, వైసీపీ నేత హత్య కేసు పదకొండు మందికి యావజ్జీవ కారాగారశిక్ష

**కర్నూలు: పెన్ పవర్:** వైసీపీ నేత పత్తికొండ మాజీ ఇన్చార్జ్ చెరుకులపాడు నారాయణరెడ్డి హత్య కేసులో కర్నూలు జిల్లా కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. మొత్తం 16 మంది నిందితుల్లో 11 మంది నిందితులకు యావజ్జీవ శిక్ష విధించింది. ఐదుగురిని నిర్దోషులుగా కోర్టు ప్రకటించింది. పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి భర్త దివంగత చెరుకులపాడు నారాయణరెడ్డి హత్య కేసులో సుధీర్ఘ విచారణ అనంతరం.. గురువారం 11 మంది నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ కర్నూలు జిల్లా కోర్టు తీర్పు ఇచ్చింది. ప్రభుత్వం తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మద్దికుంట వెంకటరెడ్డి వాదనలు వినిపించారు.
మరోవైపు కర్నూలు జిల్లా కోర్టు ఇచ్చిన సంచలన తీర్పు పట్ల దివంగత నారాయణరెడ్డి భార్య పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్పందించారు. కోర్టు తీర్పుతో న్యాయస్థానాల పట్ల మరింత నమ్మకం పెరిగిందని చెప్పారు. కోర్టు ఇచ్చిన ఈ సంచలన తీర్పుతోనైనా తనలాంటి మరో మహిళకు అన్యాయం జరగకూడదని భావిస్తున్నట్లు తెలిపారు..

# దేశిని కోటి ఆధ్వర్యంలో పొన్నం ప్రభాకర్ గౌడ్, జన్మదిన వేడుకలు...

**జమ్మికుంట: పెన్ పవర్:**గురువారం రోజున బీసీ సంక్షేమ శాఖ మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ 58వ. పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇల్లందకుంట టెంపుల్ మాజీ చైర్మన్ దేశిని కోటి, ఆధ్వర్యంలో కేక్ కట్ కట్ చేసి జమ్మికుంట బొమ్మల గుడి శివాలయంలో పొన్నం ప్రభాకర్ గౌడ్ పేరుతో ప్రత్యేక పూజలు చేయించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా దేశిని కోటి, మాట్లాడుతూ పొన్నం ప్రభాకర్ అన్న ఎన్ ఎస్ యు ఐ నాయకుడి నుండి రాష్ట్ర మంత్రిగా ఎదిగాడని కరీంనగర్ ఎంపీగా ఉన్నప్పుడు తెలంగాణ రాష్ట్రం కోసం పార్లమెంట్లో ప్రాణాలకు తెగించి కొట్లాడిన గొప్ప నాయకుడని నాడు ఆంధ్ర నాయకులు పెప్పర్స్ స్ప్రే దాడి చేసినా కూడా తెలంగాణ రాష్ట్ర కోసం తెలంగాణ ఎంపీల అందరిని ఒక తాటిపై తీసుకొచ్చి సోనియా గాంధీని మరియు ప్రతిపక్ష నేత సుష్మా స్వరాజ్ ను మెప్పించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు పొన్నం ప్రభాకర్ అని.ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గా ఉండి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కావాలని ఉద్యోగులకు విద్యార్థులకు రాజకీయంగా 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని ముఖ్యమంత్రిని మెప్పించి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపి ఢిల్లీలో ధర్నా చేసి బీసీ రిజర్వేషన్ ప్రక్రియను కొనసాగిస్తున్నాడని పొన్నం ప్రభాకర్ గౌడ్, ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఎప్పుడూ చల్లగా ఉండాలని రానున్న రోజుల్లో ఉన్నతమైన పదవులు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎర్రబెల్లి రాజేశ్వరరావు, సుంకరి రమేష్, సాయిని రవి, జమ్మికుంట మాజీ కౌన్సిలర్లు బొంగోని వీరన్న,.మారెపల్లి బిక్షపతి, ఎలగందుల శ్వేత, శ్రీహరి .పిట్టల శ్వేత రమేష్. పొనగంటి సారంగం.



దిడ్డి రామ్మోహన్. కుదాడి రాజన్న. గుల్లి పూలమ్మ మొగిలి. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట స్వప్న, కాంగ్రెస్ నాయకులు పూదరి శివ, మర్రి రాంరెడ్డి, పంజాల అజయ్,ముద్దమల్ల రవి, పోతుల శ్రీనివాస్, అశోక్, రాజ్ కుమార్, శ్రీను, యూత్ కాంగ్రెస్ నాయకులు పర్లపెల్లి నాగరాజు, సజ్జాద్ మొహమ్మద్, పాతకాల రమేష్, రాజకుమార్, తదితరులు పాల్గొన్నారు..

# విద్యుత్ శాఖపై జగన్ వి తప్పుడు ప్రచారాలు



**తాడేపల్లి: పెన్ పవర్:** విద్యుత్ శాఖ పై వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి చేసేవన్నీ తప్పుడు ప్రచారాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి గురువారం మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు. యాక్సిస్, బ్రూక్ ఫీల్డ్ కంపెనీతో కూటమి ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాల పై అవినీతి సొమ్ముతో ఏర్పాటు చేసిన సాక్షి మీడియాను అడ్డం పెట్టుకుని జగన్ మోహన్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం లో సెకీ నుంచి రూ.2.49కి విద్యుత్ కొనుగోలు చేసామనేది పచ్చి అబద్ధమని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. ట్రాన్స్మిషన్ లాసెస్, ఇతర ఖర్చులన్నీ కలిపితే రూ. 5 పైనే ఖర్చు చేయాల్సి వస్తుందని మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలపై జగన్ అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. అత్యధిక విద్యుత్ వినియోగం జరిగే సమయంలో ఒత్తిడిని తట్టుకునేందుకు, ప్రజలకు నిరంతరాయ విద్యుత్ అందించేందుకు యాక్సిస్ బ్రూక్ ఫీల్డ్ ఒప్పందాలు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి స్పష్టం చేశారు. ఈ ఒప్పందాలతో రాయలసీమ ప్రాంతంలో 400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తితో పాటు రాష్ట్ర యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఈ ఒప్పందం ద్వారా పీక్ అవర్స్ లో కూడా యూనిట్ రూ.4.60కే విద్యుత్ దొరుకుతుందని స్పష్టం చేశారు. జగన్ రెడ్డి హయాంలో 2022 లో రూ.5.12కు నాటి ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటే.. మా ప్రభుత్వం యూనిట్ విద్యుత్ ను రూ.4.60కి తగ్గించి ఒప్పందం చేసుకున్నామని వివరించారు. 1,700 ఎకరాలను రైతుల నుంచి తీసుకుని వారికి ఏడాదికి రూ.31,000 కౌలు అందిస్తున్నామని అన్నారు. అంతేగాక రాష్ట్రానికి యాక్సిస్ ఎనర్జీ నుంచి 9 శాతం జీఎస్టీ రూపంలో ఆదాయం లభిస్తుందన్నారు. యాక్సిస్ ఎనర్జీ తన పెట్టుబడులను ఏపీలో పెట్టిందని దీని ద్వారా.. విద్యుత్ కొనుగోళ్లు చేస్తుండటం వల్ల ట్రాన్స్మిషన్ లాస్ లు లాంటివి ఉండవని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. ఇటువంటి ఒప్పందాల ద్వారా విద్యుత్ ఛార్జీలు తగ్గించి ప్రజలపై భారం లేకుండా చేయాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన అని మంత్రి స్పష్టం చేశారు. పెట్టుబడిదారుల్ని తరిమికొట్టిన చరిత్ర జగన్ ది అయితే...., పెట్టుబడులు ఆహ్వానించి రాష్ట్రానికి ఆదాయం సమకూరుస్తూ ఉపాధి కల్పిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదని మంత్రి గొట్టిపాటి కొనియాడారు.

**షార్ట్ టైం పవర్ పర్చేజ్ పేరుతో దోపిడీ..**

.రాష్ట్రం విడిపోయిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ గా మార్చారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. మిగులు విద్యుత్ రాష్ట్రంగా వైసీపీకి అప్పగిస్తే.... 2019 – 2024 వరకు విద్యుత్ రంగాన్ని విధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. షార్ట్ టైం పవర్ పర్చేజ్ పేరుతో ఒక్క సంవత్సరంలోనే రూ.10,000 కోట్లు ఖర్చు చేసి... ప్రజల నెత్తిన మోయలేని భారాన్ని మోపారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచారని గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఎఫ్.పీ.పీ.ఐ ఛార్జీల పేరిట వేసిన రూ.20,000 కోట్ల విద్యుత్ భారం ప్రస్తుతం ప్రజలపై పడిందన్నారు. దీనిని కూడా కూటమి ప్రభుత్వం వేసిందని అసత్య ప్రచారం చేస్తూ... బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. వీటన్నింటిపైనా అసెంబ్లీ సాక్షిగా కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పిందని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు.

# కార్పొరేట్ స్థాయి వైద్యం కోదాడ కు అందుబాటులోకి తేవడం అభినందనీయం

వైద్యశాలలు వ్యాపార దృక్పథంతో కాక సేవా దృక్పథంతో వ్యవహరించాలి

పేదలకు అందుబాటులో కార్పొరేట్ వైద్యం అందించాలి

మెరుగైన వైద్య సేవలు అందించి ఎస్వీఎస్ వైద్యశాల పేరు తెచ్చుకోవాలి.....

మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి



**సూర్యాపేట: పెన్ పవర్:** నగరాలకే పరిమితమైన కార్పొరేట్ స్థాయి వైద్యం కోదాడ కు అందుబాటులోకి తేవడం అభినందనీయమని రాష్ట్ర భారీ నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని హుజూర్నగర్ రోడ్ లో ఫ్లై ఓవర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కోదాడ హుజూర్నగర్ ప్రాంత ప్రజలకు అందుబాటులో కార్పొరేట్ వైద్యాన్ని అందించాలని వైద్యులకు సూచించారు పూర్తి వ్యాపార దృక్పథంతో కాకుండా వైద్యులు సేవా దృక్పథంతో పేద మధ్యతరగతి ప్రజలకు సేవలు అందించాలన్నారు. ప్రజలకు విద్య వైద్యం అత్యంత ఆవశ్యకమని కోదాడలో మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడం ప్రశంసనీయమన్నారు. అభివృద్ధికి చెందిన అంశాలపై తన వంతు సహకారం అన్నివేళలా ఉంటుందన్నారు. వైద్యశాలలో అత్యాధునిక సదుపాయాలు అందుబాటులో ఉన్న వైద్య సేవల వివరాలను నిర్వాహకులు డాక్టర్ శివప్రసాద్ రావూరు మంత్రికి వివరించారు. అనంతరం డాక్టర్ శివప్రసాద్ రావూరు మాట్లాడుతూ వైద్యశాలలో హైదరాబాద్ వంటి నగరాలకు దీటుగా గుండె ఊపిరితిత్తులు మెదడు నరాలు మూత్రపిండా వ్యాధులు క్రిటికల్ కేర్ ఎమర్జెన్సీ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు ప్రతి విభాగానికి అనుభావాజ్ఞులైన వైద్యులు వైద్య పరికరాలు వ్యాధి పరిశోధక యంత్రాలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. వైద్యశాల అన్నివేళలా అందుబాటులో ఉంటుందన్నారు అనంతరం వైద్యశాల యాజమాన్యం మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని ఘనంగా సన్మానించింది ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ రావూరు శివప్రసాద్, డాక్టర్ నరేందర్ ఎస్ వి ఎస్ హాస్పిటల్ వైద్యుల బృందం, కోదాడ పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ జాస్తి సుబ్బారావు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని ప్రమీల రమేష్, కోదాడ హుజూర్నగర్ ఐఎంఏ వైద్యులు కోదాడ హుజూర్నగర్ పట్టణాల ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు

# గాలి జనార్ధన రెడ్డి ఓవర్... నెక్ట్స్ ఎవరు...



**హైదరాబాద్, మే 8 పెన్ పవర్:** ఓబులాపురం మైనింగ్ కేసులో గాలి జనార్ధన్ రెడ్డికి ఏడేళ్ల పాటు జైలు శిక్ష పడింది. 15 సంవత్సరాల సుదీర్ఘ విచారణ అనంతరం నాంపల్లి సిబిఐ కోర్టు తుది తీర్పును వెల్లడించింది. జనార్ధన్ రెడ్డితో సహా ఐదుగురిని దోషులుగా నిర్ధారించింది. ఏడు సంవత్సరాల పాటు జైలు శిక్ష విధించింది. అయితే పర్యావరణానికి విఘాతం కలిగిస్తూ.. పోగేసిన సంపదతో పోలిస్తే ఇది చాలా చిన్న శిక్ష. కానీ భారత శిక్షాస్మృతి ప్రకారం ఆయనకు ఏడేళ్లు జైలు శిక్ష పడింది. ఇటీవల సిబిఐ కేసులలో తుది తీర్పు రావడం అరుదు. కానీ వ్యవస్థలను మేనేజ్ చేస్తూ వస్తున్న గాలి జనార్ధన్ రెడ్డికి ఈ స్థాయిలో శిక్ష పడడం అనేది నిజంగా షాకింగ్ ఇచ్చే అంశమే. ముఖ్యంగా ఇది గాలి జనార్ధన్ రెడ్డికి సన్నిహితుడిగా ఉన్న జగన్మోహన్ రెడ్డికి షాకింగ్ పరిణామమే. ఇప్పుడు అందరి చూపు జగన్మోహన్ రెడ్డి సిబిఐ కేసులపై పడింది. గాలి జనార్ధన్ రెడ్డిపేరుకే కర్ణాటక బిజెపి నేత. ఆయన ఎప్పుడూ ఏపీ రాజకీయాలను ప్రభావితం చేస్తుంటారు అని ఒక పేరు ఉంది. జగన్మోహన్ రెడ్డిని తన సొంత సోదరిగా చెప్పుకుంటారు. వైయస్ రాజశేఖర్ రెడ్డిని తండ్రిగా భావిస్తారు. అయితే ఓబులాపురం మైనింగ్ కేసులు నమోదైన తరువాత గాలి జనార్ధన్ రెడ్డి తనకు ఎవరో తెలియదని జగన్ తప్పించుకున్నారు. అయితే సగటు రాజకీయాలపై అవగాహన ఉన్న ప్రతి ఒక్కరికి వారిద్దరి మధ్య ఉన్న బంధం తెలుసు. ఓబులాపురం మైనింగ్ అనుమతులు ఏ ప్రభుత్వంలో వచ్చాయి అన్న విషయం కూడా అందరికీ విధితమే. జనార్ధన్ రెడ్డి తనకు ఎవరు తెలియదు అన్నంత మాత్రాన ప్రజలు నమ్మే స్థితిలో మాత్రం లేరు. వాస్తవానికి 2019 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి గెలవకపోతే.. గాలి జనార్ధన్ రెడ్డితో కలిసి పొలిటికల్ ప్లాన్ చేసుకున్నట్లు వార్తలు వచ్చాయి. అప్పటికే గాలి బ్రదర్స్ యువజన, శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీని పెట్టారు. తేడా వస్తే గ్రేటర్ రాయలసీమ ఉద్యమం చేసి.. బళ్లారి ని కూడా కలిపి సొంత రాష్ట్రంగా ఏర్పాటు చేయించాలని ప్లాన్ చేశారు. అయితే 2019లో బిజెపి అజేయమైన శక్తిగా మారింది. కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. అందుకే గాలి జనార్ధన్ రెడ్డి తన పార్టీని బిజెపిలో విలీనం చేశారు. మళ్లీ పార్టీ పెట్టారు. మరోసారి కూడా బిజెపిలోనే విలీనం చేశారు. అయితే ఇప్పుడు బిజెపిలో ఉన్నా.. గాలి జనార్ధన్ రెడ్డికి మాత్రం అక్రమ మైనింగ్ కేసులో శిక్ష పడడం జగన్మోహన్ రెడ్డి లాంటి వారికి ఆందోళన కలిగిస్తోంది2011లో అక్రమాస్తుల కేసుల్లో అరెస్ట్ అయ్యారు జగన్మోహన్ రెడ్డి. అదే సమయంలో ఓబులాపురం మైనింగ్ కేసులో గాలి జనార్ధన్ రెడ్డిని కూడా అరెస్టు చేశారు. అత్యంత క్లిష్టమైన కేసుగా సిబిఐ అభివర్ణించింది. వ్యవస్థలను మేనేజ్ చేసుకుని ఎన్ని రకాల ప్రలోభాలు పెట్టినా చివరకు గాలి జనార్ధన్ రెడ్డికి శిక్ష తప్పలేదు. ఇప్పుడు జగన్మోహన రెడ్డి అక్రమాస్తుల కేసులో అన్ని కళ్ళు ఎదుట కనిపిస్తున్నాయి. పైగా రాజకీయ ప్రత్యర్థులు స్ట్రాంగ్ అయ్యారు. వారికి కేంద్రం అండదండలు ఉన్నాయి. కచ్చితంగా గాలి జనార్ధన్ రెడ్డి కేసును పరిగణలోకి తీసుకుంటే మాత్రం.. జగన్మోహన్ రెడ్డికి శిక్ష పడడం ఖాయమని తెలుస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# ఆపరేషన్ సింధూర్... కంటిన్యూ....




**న్యూఢిల్లీ, మే 8, పెన్ పవర్:**
ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పాకిస్తాన్‌కు భారతదేశం ఇచ్చిన సందేశం కేవలం ప్రారంభం మాత్రమే. పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతిస్పందనగా పాకిస్తాన్, పీఓకేలో ఉన్న తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా భారత సైన్యం ప్రదర్శించిన ఆపరేషన్ సింధూర్ విజయవంతమైంది. ఈ దాడిలో దాదాపు 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. ఈ దాడితో పాకిస్తాన్ దిగ్భ్రాంతికి గురైంది. అయితే, మిషన్ ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతోందని భారత సైన్యం తెలిపింది. దీని వల్ల పాకిస్తాన్ పై పొంచి ఉన్న ప్రమాదం ఇంకా తప్పలేదని స్పష్టమవుతోంది. ఎందుకంటే ఆపరేషన్ సింధూర్ 2.0 లో ఏదైనా జరగవచ్చు. ఉగ్రవాదాన్ని ఆశ్రయించే వారికి ఎలాంటి ఉపశమనం లేదని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ దాడి తర్వాత పాకిస్తాన్‌లో భయాందోళనలు నెలకొన్నాయి. పంజాబ్ ప్రావిన్స్‌లో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. ప్రధాన మంత్రి షాబాజ్ షరీఫ్ దీనిని యుద్ధ చర్యగా అభివర్ణించారు. అయితే పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ ఇప్పటికీ మౌనంగా ఉన్నారు. భారతదేశం ఈ చర్య ద్వారా, పాకిస్తాన్ రాజకీయ, సైనిక నాయకత్వంపై ఒత్తిడి స్పష్టంగా కనిపిస్తుంది. భారతదేశం ఇప్పుడు కేవలం రక్షణ విధానంపైనే కాకుండా దాడి వ్యూహంపై కూడా పనిచేస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. పహల్గామ్‌కు ప్రతిస్పందనగా మొదట ఉరి, తరువాత పుల్వామా, తరువాత బాలకోట్, ఇప్పుడు ఆపరేషన్ సింధూర్. ఇదంతా భారతదేశం మారిన సైనిక ఆలోచనను ప్రతిబింబిస్తుంది. ఇప్పుడు పాకిస్తాన్ అర్థం చేసుకోవాలి, ఉగ్రవాద కర్మాగారం తన నేల నుండి పనిచేయలేమని, దానిని పనిచేయడానికి అనుమతిస్తే ఫలితం కేవలం ఖండించడం మాత్రమే కాదు, బలమైన సైనిక ప్రతిస్పందన కూడా అవుతుంది. ఈసారి పాకిస్తాన్‌ను ఒంటరి చేసే వరకు అంగీకరించబోమని భారతదేశం పూర్తి మూడ్‌లో ఉంది. అదే సమయంలో, బలూచ్‌లు పాకిస్తాన్ ప్రభుత్వంతో ఏమాత్రం సంతోషంగా లేరు. ఇది మాత్రమే కాదు, అక్కడి స్థానిక పోలీసులు కూడా ప్రభుత్వం, సైన్యం చర్యల పట్ల అసంతృప్తిగా ఉన్నారు. అటువంటి పరిస్థితిలో, పాకిస్తాన్ భూభాగాన్ని రెండు భాగాలుగా విభజించడానికి భారతదేశానికి ఇది ఒక సువర్ణావకాశం. ఏదైనా దేశం భారతదేశం వైపు కళ్ళు ఎత్తడానికి ధైర్యం చేస్తే, భారత సైన్యంలోని ప్రతి సైనికుడు మహాకాళుడి ఉగ్ర రూపాన్ని స్వీకరించడం ద్వారా దాని స్వంత భాషలో దానికి సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాడనే బలమైన సందేశాన్ని ఇది ప్రపంచానికి పంపుతుంది. బలూచిస్తాన్ పాకిస్తాన్‌కు చాలారోజులుగా కొరకరాని కొయ్యగా మారింది. దానిని ప్రపంచ దృష్టి నుండి దాచిపెడుతుంది. అయితే, ఆపరేషన్ సింధూర్ 2.0 లో, పాకిస్తాన్‌ను ఒకదానికొకటి వేరు చేయడం ద్వారా ఈ బాధాకరమైన అంశాన్ని పరిష్కరించడానికి భారతదేశం సిద్ధంగా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ 2.0 లో 1971 యుద్ధం మాదిరిగానే బలూచిస్తాన్‌ను వేరు చేయడానికి భారతదేశం ప్రణాళిక వేయవచ్చు. దీని వలన ప్రపంచం మొత్తం భారతదేశం శక్తిని గుర్తిస్తుంది. పాకిస్తాన్‌కు మద్దతు ఇస్తున్న చైనా, టర్కీ వంటి దేశాలు కూడా పూర్తిగా మౌనంగా ఉండిపోయాయి. కాబట్టి పాకిస్థాన్ ప్రజలకు ఈ విషయాన్ని గ్రహించడం చాలా ముఖ్యం.

# ఉగ్రవాదులతో పాకిస్తాన్ ఆర్మీ...

**ఇంత కంటే ఏం కావాలంటున్న భారత్**



**న్యూఢిల్లీ, మే 8, పెన్ పవర్:** పంచ దేశాల్లారా ఇదిగో సాక్ష్యం.. పాకిస్తాన్‌లో సైన్యానికి, టెర్రరిస్టులకు మధ్య ఎలాంటి తేడా లేదనడానికి ఇదో ప్రత్యక్ష నిదర్శనం. ఇటీవల వెలుగులోకి వచ్చిన ఒక వీడియోలో పాకిస్తాన్ ఆర్మీకి చెందిన ఉన్నతాధికారులు బహిరంగంగా టెర్రరిస్టుల అంత్యక్రియల్లో పాల్గొనడం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ దృశ్యం పాకిస్తాన్ నిజ స్వరూపాన్ని ప్రపంచానికి చాటి చెబుతోంది. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ అసలు ముఖం మరోసారి బయటపడింది. పాకిస్తాన్ ఆర్మీకి చెందిన యూనిఫామ్ ధరించిన అధికారులు, టెర్రరిస్టుల అంతిమ యాత్రలో గౌరవంగా నిలబడి ఉండడం, వారి అంత్యక్రియల కార్యక్రమాలలో పాల్గొనడం స్పష్టంగా కనిపిస్తోంది. ఇది కేవలం సాధారణ సైనికులు పాల్గొనడం కాదు, ఉన్నత స్థాయి అధికారులు కూడా ఉగ్రవాదులకు సెల్యూట్ చేస్తూ వారి మృతికి సంతాపం తెలుపుతున్నట్లు కనిపిస్తోంది. టెర్రరిస్టులకు పాకిస్తాన్ ఆర్మీ బహిరంగంగా మద్దతు తెలుపుతున్న ఈ దృశ్యం, అంతర్జాతీయ సమాజానికి ఒక హెచ్చరిక లాంటింది. ఉగ్రవాదంపై పోరాడుతున్నామని ప్రపంచానికి చెబుతున్న పాకిస్తాన్, వాస్తవానికి ఉగ్రవాదులను ప్రోత్సహిస్తోందని ఈ వీడియో స్పష్టం చేస్తోంది. ఇలాంటి ఘటనలు ఇది మొదటిసారి కాదు. గతంలో కూడా పాకిస్తాన్ ఆర్మీ టెర్రరిస్టులకు ఆశ్రయం కల్పిస్తున్నట్లు, వారికి ట్రైనింగ్ ఇస్తున్నట్లు అనేక నివేదికలు వెలువడ్డాయి. అంతర్జాతీయ వేదికలపై ఉగ్రవాదంపై పోరాటం గురించి మాట్లాడే పాకిస్తాన్, తెర వెనుక ఉగ్రవాదులకు అన్ని విధాలా సహాయం చేస్తూ వస్తోంది. ఈ వీడియోతో ఆ వాదనలకు మరింత బలం చేకూరినట్లయింది. భారత్ ఎప్పటినుంచో పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందని ఆరోపిస్తోంది. సరిహద్దుల్లో చొరబాట్లు, దాడులు చేయిస్తుంది పాకిస్తాన్ ఆర్మీ శిక్షణ పొందిన టెర్రరిస్టులే అని అనేక సార్లు ప్రూఫ్ లతో సహా తెలిపింది. ఇప్పుడు ఈ వీడియో భారత వాదనలకు మరింత బలం చేకూరుస్తోంది. పాకిస్తాన్ ఆర్మీ, టెర్రరిస్టులకు మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని ఈ వీడియో కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది.

# గొంతు కోసి మహిళ హత్య

**హైదరాబాద్ పెన్ పవర్:** చంద్రయాన్ గుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో కేశవగిరి ప్రాంతంలో ఉన్న ఒక ఇంట్లో నుండి మంటలు వస్తుండటం తో స్థానికులు 100 డయల్ చేసి మంటలను ఆర్పగా ఇంట్లో మహిళను గొంతు కోసి కాల్చిహత్య చేసినట్లు తెలిసింది. డివిజన్ నైట్ ఆఫీసర్ బండ్లగూడ ఇన్స్పెక్టర్ గురునాథ్ సంఘటన స్థలానికి చేరుకొన్నారు , సైబర్ క్రైమ్ డీసీపీ కవిత కూడా వచ్చి ఇది హత్య చేసి కాల్చినట్లుఅని నిర్ధారించారు. ఇంట్లో ఉన్న వస్తువులను వెదక గా ఆమె పేరు కేతవత్ బుజ్జి భర్త రూప్ల గా గుర్తించారు ఆమెకు ఒక కొడుకు అతను అప్పుడప్పుడు వచ్చి వెళుతుంటాడు మహిళ కూలి చేసుకొని బ్రతుకుతుంది అని తెలిసింది సంఘటన విషయం తెలుసుకొన్న చంద్రయాన్ గుట్ట ఇన్స్పెక్టర్ గోపి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు

# మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి గురువారం ఉదయం మరణించారు. అయన మృతి పట్ల మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సంతాపం తెలిపారు. హబ్సిగూడ లోని నివాసానికి వెల్లి రాజిరెడ్డి పార్థీవ దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# అసాంఘిక, చట్ట వ్యతిరేక పనులు చేస్తున్న వ్యక్తులే లక్ష్యంగా ““ఆపరేషన్ చబుత్రా””

**గోదావరిఖని 1 టౌన్ పోలీసుల అధ్వర్యం లో అర్ధరాత్రి ముమ్మర తనిఖీలు.**

**గోదావరిఖని పెన్ పవర్:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి జిల్లా గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా, పెద్దపల్లి డీసీపీ కర్ణాకర్ ఆదేశాల మేరకు గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ గారి పర్యవేక్షణ లో ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి ఆధ్వర్యంలో ఆపరేషన్ చబుత్రా ను నిర్వహించారు. పోలీస్ అధికారులు సిబ్బంది తో కలిసి బైక్ పై పెట్రోలింగ్ చేస్తూ రాత్రి వేళల్లో ప్రధాన కూడళ్లు, వీధులు, రోడ్ల పై గుంపులుగా జులాయిగా తిరుగుతూ ప్రజలను ఇబ్బందిలకు గురిచేస్తూ, మద్యం సేవించి రోడ్లపై ద్విచక్ర వాహనాలతో తిరుగుతున్న యువకులను, అనుమానస్పదంగా తిరుగుతున్న వారిని ఉన్న 60 మంది యువకులను, 29 బైక్ లు, 01, కారు అదుపులోకి తీసుకోవడం జరిగింది. పట్టుబడిన వారికీ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరిగింది, పట్టుబడిన వారిపై ఇ - పెట్టి కేసు నమోదు చేసి, కౌన్సిలింగ్ నిర్వహించి భవిష్యత్తు మరల పట్టుబడినచో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.
ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి మాట్లాడుతూ...ఆ కారణంగా ఎలాంటి పని లేకుండా అవసరమైతే తప్ప అర్ధరాత్రి దాటిన తర్వాత ఎవరు కూడా వీధుల్లో తిరిగరాదని తెలిపినారు. రాత్రి 10 గంటల తర్వాత ఎవరైనా యువకులు రోడ్లపై విన్యాసాలు చేస్తూ, గుంపులుగా కనబడితే వారిని అరెస్ట్ చేసి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండి రాత్రి వేళలో ఆ కారణంగా బయటికి వెళ్లకుండా చూడాలని తెలపడం జరిగింది. యువత ఏలాంటి చెడు మార్గాలకు వెళ్లకుండా తమ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని తెలిపినారు. చెడు వ్యసనాలకు అలవాటు పడి రాత్రి పూట బయట తిరుగుతూ ప్రమాదాలకు గురికావడం జరుగుతుంది. ఆపరేషన్ చభుత్ర లో పట్టుబడిన వారి యొక్క వెహికల్స్ ను స్వాధీనం చేసుకొని వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి తెలిపినారు. ఈ యొక్క ఆపరేషన్ చభుత్ర లో గోదావరిఖని వన్ టౌన్ ఎస్ఐ రమేష్, శ్రీనివాస్, భూమేష్, కోటేశ్వర్ లు, పోలీస్ స్టేషన్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు..

# పట్టుదలతో చదివి మీ లక్ష్యాలను అధిగమించండి...

**గోదావరిఖని ఏసిపి మడత రమేష్.**

**కమాన్ పూర్: పెన్ పవర్:** ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి మీ లక్ష్యాలను అధిగమించాలని గోదావరిఖని ఏసిపి మడత రమేష్ అన్నారు. ఎయిట్ ఇంక్ లైన్ కాలనీకి చెందిన స్పందన పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.
క్రమశిక్షణతో బాగా చదివి మీ లక్ష్యాలను సాధించుకోవాలని రామగుండం ఏసిపి మడత రమేష్ అన్నారు. తను చాంబర్లో ఇటీవల ఎస్ఎస్సి పరీక్షలలో అత్యధిక మార్పులు సాధించిన స్పందన మోడల్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులను సన్మానించి మాట్లాడారు. ఈ సందర్భంగా క్రమశిక్షణతో చదువుపై పట్టు పెంచుకొని తల్లిదండ్రులకు గురువులకు మంచి పేరు తీసుకురావాలని తద్వారా మీరు ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. భవిష్యత్ బాగుండాలంటే విద్యార్థిని విద్యార్థులు మొబైల్ కు దూరంగా ఉండాలని అప్పుడే చదువుపై శ్రద్ధ అలవాటు ఉందని అన్నారు. యోగ క్రీడల ద్వారా శరీరాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుకొని ముందుకు సాగాలని విద్యార్థులను కోరారు. పిల్లలు ఎంచుకున్న మార్గాన్ని తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అన్నారు. ఈ సందర్భంగా పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఆర్.తనయ 575, ఏ. భాను శ్రేయ 567, ఎం.అక్షర 562, కే.శ్రీజ 561, ఏ.ప్రభాస్ 559, ఈ. స్ఫూర్తి 554, ఏ.ప్రణవ్ 538, ఎన్. శ్రీ హర్షిని 536, సిహెచ్.ఆశ్రిత 528, యు.అనన్య, పి.వినయ్ 524, వి.ఆశ్రిత 511 శాలువాతో ఏసిపి రమేష్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొండగట్టు మాజీ డైరెక్టర్ జక్కుల దామోదర్ రావు, పాఠశాల కరస్పాండెంట్ పాశం ఓదెల యాదవ్, ప్రిన్సిపాల్ ఆర్.రవీందర్ రావు, ఉపాధ్యాయులు సుహాసిని, సునీత తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ కళ బృందం ద్వారా ప్రజలకు అవగాహన

**కొడిమ్యాల: పెన్ పవర్:** జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపిఎస్ ఆదేశాల మేరకు కొడిమ్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని చెప్యాల గ్రామం లో పోలీస్ కళాబృందం వారు సైబర్ నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాలు , మరియు ట్రాఫిక్ నియమాలు, మూఢ నమ్మకాలు గల్ఫ్ ఏజెంట్ ల మోసాలు, మరియు షీ టీం పై అవగాహన, సీసీ కెమెరాల యొక్క ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమం భాగంగా ఎస్ఐ సందీప్ గారు మాట్లాడుతూ ఈ మధ్యకాలం లో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని, సైబర్ నేరగాళ్ల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని, ఎవరైనా మోసపోయినట్లైతే 1930 నంబర్ కి పిర్యాదు చేయాలని,పోలీస్ స్టేషన్ పరిధిలో అన్ని గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. దీని వల్ల గ్రామంలో ఏ సంఘటన జరిగిన వెంటనే తెలుస్తోంది అని తెలిపారు, సిసి కెమెరాలు ఏర్పాటు సహకరించలని గ్రామస్థులను కోరారు. తల్లిదండ్రులు పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని అన్నారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకూడదని,ప్రభుత్వం ,పోలీస్ తరపున అన్ని విధాల సహాయహకారులు ఉంటాయని అన్నారు. వాహన దారులు తాగి డ్రైవింగ్ చేయవద్దని, లైసెన్స్ లేకుండ వాహనాలు నడపవద్దని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ఆవశ్యకత గురించి వివరించారు.
గ్రామాల్లో అనుమానస్పదంగా వ్యక్తులు కనపడితే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు వున్న పోలీస్ స్టేషన్ కు తెలియపరచాలని తెలిపారు. గ్రామంలో చిన్న చిన్న తగాదాలకు పోయి జీవితం నాశనము చేసుకొవద్దని, నేరరహిత గ్రామాలుగ చేయడానికి ప్రజలు కృషి చేయాలనీ సూచించారు. మంత్రాలు తంత్రాలు ముడనమ్మకాలు నమ్మవద్దని, గ్రామాల్లో ఏ సమ్యస వున్న వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో తెలుపాలన్నారు,లేదా 100 నెంబర్ కు ఫోన్ చేస్తే నిమిషాల్లో పోలీసులు తమ వద్దకు వస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సందీప్ పోలీసు సిబ్బంది, పోలీస్ కళా బృందం సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# భారత క్రికెట్ చరిత్రలో తొలిసారి.. ఇకపై మూడు ఫార్మాట్లకు ముగ్గురు కెప్టెన్లు



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ చరిత్రలో తొలిసారి మూడు ఫార్మాట్ లను ముగ్గురు కెప్టెన్లు నడిపించనున్నారు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ బుధవారం (మే 7) టెస్టు ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇప్పటికే టీ20 ఫార్మాట్ నుంచి తప్పుకున్న హిట్‌మ్యాన్ వన్డేల్లో కొనసాగుతానని తెలిపాడు. దీంతో రోహిత్ కేవలం వన్డేల్లో మాత్రమే కెప్టెన్సీ చేయనున్నాడు. రోహిత్ 2027 వన్డే వరల్డ్ కప్ ఆడాలని డిసైడయ్యాడని, అప్పటిదాకా ఫిట్‌గా ఉండేందుకే టెస్టులకు వీడ్కోలు ప్రకటించాడని అతని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. దీంతో రోహిత్ ను 2027 వన్డే వరల్డ్ కప్ వరకూ కెప్టెన్సీ నుంచి తొలగించే అవకాశాలు దాదాపుగా లేవు. టీ20 క్రికెట్ లో సూర్య కుమార్ యాదవ్ కెప్టెన్ గా కొనసాగుతున్నాడు. భారత యువ జట్టు సూర్య కెప్టెన్సీలో తిరుగులేని జట్టుగా దూసుకెళ్తుంది. సూర్య వన్డే, టెస్ట్ ఫార్మాట్ లలో ఆడడం లేదు. అతన్ని కేవలం టీ20 ఫార్మాట్ లోనే కొనసాగుతున్నాడు. 2026 టీ20 వరల్డ్ కప్ కు సూర్య కెప్టెన్ గ ఆకొనసాగడం ఖాయంగా కనిపిస్తుంది. టెస్ట్ కెప్టెన్సీని రోహిత్ శర్మ, సూర్య చేపట్టే అవకాశాలు లేవు. దీంతో ఇప్పుడు కొత్త టెస్ట్ కెప్టెన్ ఎవరనే విషయంలో ఆసక్తి నెలకొంది. రోహిత్ రిటైర్మెంట్ తర్వాత వచ్చే నెలలో ఇంగ్లండ్‌తో జరగనున్న ఐదు టెస్టుల సిరీస్‌లో ఇండియాకు కొత్త కెప్టెన్ ఎంపిక అనివార్యమైంది. జూన్ 20న మొదలయ్యే ఈ టూర్ కోసం సెలెక్టర్లు వారంలో టీమ్‌ను ప్రకటించనుండగా.. కెప్టెన్సీ రేసులో బుమ్రా, రాహుల్, శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్ ఉన్నారు. ప్రస్తుత వైస్ కెప్టెన్ బుమ్రాకు ఇప్పటికే కొన్ని మ్యాచ్‌ల్లో జట్టును నడిపించిన అనుభవం ఉంది. కానీ, ఫాస్ట్ బౌలర్ కావడం, తరచూ గాయాలు అవుతున్నందున బుమ్రాను ఫుల్‌టైమ్ కెప్టెన్ చేసే విషయంలో సెలెక్టర్లు, బోర్డు పెద్దలు వెనకడుగు వేస్తున్నారు. బ్యాటర్‌గా పంత్‌లో నిలకడ లేకపోవడం ప్రతికూలం కానుంది. ఈ నేపథ్యంలో రాహుల్, గిల్‌లో ఒకరికి పగ్గాలు అప్పగించే చాన్స్ కనిపిస్తోంది. దీంతో భారత క్రికెట్ లో తొలిసారి మూడు ఫార్మాట్లలో ముగ్గురు కెప్టెన్లను చూడబోతున్నాం.

# ప్లే ఆఫ్స్‌కు ముందు ఢిల్లీ సూపర్ ప్లాన్.. బ్రూక్ స్థానంలో ఆఫ్ఘనిస్తాన్ ప్లేయర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025కు ముందు ఢిల్లీ క్యాపిటల్స్ ప్లే ఆఫ్స్ కు ముందు కీలక మార్పు చేసింది. ఐపీఎల్ 2025లో సీజన్ లోని మిగిలిన మ్యాచ్ లకు హ్యారీ బ్రూక్ స్థానంలో ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన సెదికుల్లా అటల్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ ప్రకటించింది. బుధవారం (మే 7) ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ ఇంగ్లాండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ స్థానంలో ఆఫ్ఘనిస్తాన్ బ్యాటర్ సెడికుల్లా అటల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఇంగ్లండ్ యువ క్రికెటర్ హ్యారీ బ్రూక్?పై బీసీసీఐ నిషేధం విధించిన సంగతి తెలిసిందే. అర్ధాంతరంగా ఐపీఎల్ నుంచి తప్పుకోవడంతో బ్రూక్ పై రెండేళ్ల పాటు ఐపీఎల్?లో ఆడే అవకాశం లేకుండా బ్యాన్ చేసింది. దీని ప్రకారం ఈ ఇంగ్లీష్ యువ బ్యాటర్ 2025, 2026 ఐపీఎల్ సీజన్స్?లో ఆడడానికి వీలు లేదు. వేలంలో ఫ్రాంచైజీలు ఆటగాళ్లను కొనుగోలు చేసిన తర్వాత.. ఆ ఆటగాడు గాయపడితే తప్ప ఇతర ఏ కారణంతో విదేశీ ఆటగాళ్లు వైదొలిగినా రెండేళ్ల నిషేధం తప్పదని ఐపీఎల్ నియమనిబంధనల్లో స్పష్టంగా ఉంది. ఈ రూల్ విధించిన తర్వాత నిషేధం ఎదర్కొన్న తొలి ఆటగాడు బ్రూక్. దీంతో ఐపీఎల్ తదుపరి రెండు సీజన్ లలో బ్రూక్ స్థానంలో అటల్ కొనసాగనున్నాడు. అటల్ గత ఏడాది కాలంగా ఆఫ్ఘనిస్తాన్ లో అత్యంత నిలకడైన బ్యాటర్ గా రాణిస్తున్నాడు. ఇప్పటివరకు ఈ టాపార్డర్ బ్యాటర్ టీ20 ఫార్మాట్ లలో 49 మ్యాచ్‌లు ఆడి 13 హాఫ్ సెంచరీలతో 34 సగటుతో 1507 పరుగులు చేశాడు. 2023లో కాబూల్ ప్రీమియర్ లీగ్ లో ఒకే ఓవర్‌లో 48 పరుగులు చేసి ప్రపంచ క్రికెట్ ను ఆశ్చర్యపరిచాడు. ఈ మ్యాచ్ లో అటల్ కేవలం 56 బంతుల్లో 118 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. గత సంవత్సరం, ఆసియా క్రికెట్ కౌన్సిల్ మెన్స్ టీ20 ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్‌లో ఆఫ్ఘనిస్తాన్ విజయంలో అటల్ కీలక పాత్ర పోషించాడు. ఈ టోర్నీలో 5 మ్యాచ్‌ల్లో 368 పరుగులతో టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. ప్రస్తుత ఐపీఎల్ సీజన్ లో ఢిల్లీ క్యాపిటల్స్ ప్లే ఆఫ్స్ రేస్ లో ఉంది. ఇప్పటివరకు ఆడిన 11 మ్యాచ్‌ల్లో 6 విజయాలతో పాయింట్ల పట్టికలో ఐదవ స్థానంలో ఉంది. వారి తదుపరి మ్యాచ్ మే 8న గురువారం పంజాబ్ కింగ్స్‌తో ఆడాల్సి ఉంది. మరికాసేపట్లో ఈ మ్యాచ్ జరగనుంది. మరి ఈ మ్యాచ్ ప్లేయింగ్ 11లో ఢిల్లీ క్యాపిటల్స్ అటల్ కు ఛాన్స్ ఇస్తారో లేదో చూడాలి.

# అదే టైమ్ కు... రిటైర్మెంట్ ప్రకటించిన ధోనీ, రోహిత్

**హఠాత్తుగా టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్**

**సాయంత్రం 7 గంటల 29 నిమిషాలకు సోషల్ మీడియా వేదికగా ప్రకటన**

**ఐదేళ్ల క్రితం సరిగ్గా ఇదే సమయానికి టెస్టులకు వీడ్కోలు పలికిన ధోనీ**

**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ బుధవారం హఠాత్తుగా టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశాడు. సోషల్ మీడియా వేదికగా తాను రెడ్-బాల్ క్రికెట్ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించాడు. హిట్‌మ్యాన్ నిర్ణయం అభిమానులను షాక్ గురి చేసింది. అయితే, యాదృచ్ఛికంగా రోహిత్ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన సమయం, మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ లాంగ్ ఫార్మాట్ నుంచి తప్పుకుంటున్న ప్రకటించిన సమయం ఒకటే కావడం ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. మహీ కూడా సైలెంట్‌గా సాయంత్రం వేళ సోషల్ మీడియా ద్వారా రెడ్-బాల్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ధోనీ 2020లో ఏ క్షణాన రిటైర్మెంట్ ప్రకటించారో సరిగ్గా బుధవారం నాడు అదే సమయానికి (19:29 గంటలు) రోహిత్ కూడా తన టెస్ట్ కెరీర్‌కు ముగింపు పలికాడు. ఈ ఇద్దరూ సొంత గడ్డపై వాంఖడే స్టేడియంలో, విదేశీ గడ్డపై మెల్‌బోర్న్‌లో తమ చివరి టెస్టులు ఆడడం గమనార్హం. "హలో ఎవ్రీ వన్... నేను టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అవుతున్నానని మీతో పంచుకోవాలనుకుంటున్నాను. వైట్ డ్రెస్‌లో నా దేశానికి ప్రాతినిధ్యం వహించడం నాకు దక్కిన గౌరవం. సంవత్సరాలుగా నాపై మీ అందరి ప్రేమ, మద్దతుకు ధన్యవాదాలు" అని రోహిత్ టీమిండియా టెస్ట్ క్యాప్ ఫొటోతో తన టెస్ట్ రిటైర్మెంట్‌పై సోషల్ మీడియా వేదికగా ప్రకటన చేశాడు. కాగా, రోహిత్ సారథ్యంలో భారత జట్టు 24 టెస్టులు ఆడింది. ఇందులో భారత్ 12 టెస్టుల్లో విజయం సాధించగా... తొమ్మిదింట్లో పరాజయం పాలైంది. మూడు డ్రాగా ముగిశాయి. టెస్టుల నుంచి రిటైర్ అయిన రోహిత్ వన్డేల్లో మాత్రం కనిపించనున్నాడు. ఇక, గతేడాది జరిగిన ఐసీసీ టీ20 ప్రపంచకప్ ఫైనల్ తర్వాత పొట్టి ఫార్మాట్ నుంచి కూడా హిట్‌మ్యాన్ వైదొలిగిన విషయం విదితమే.




# కత్రినా కూడా వెయిట్ చేస్తుందట..!



**జినాల్ జోషి ఒక ఫ్రేమ్ కోసం చాలా గ్లామ్**



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కత్రినా కైఫ్ ఇప్పుడు అంతగా ఫాం లో లేదు కానీ ఒకప్పుడు అమ్మడు బాక్సాఫీస్ ని షేక్ చేసిన విషయం తెలిసిందే. బీ టౌన్ ఆడియన్స్ డ్రీం గర్ల్ గా కత్రినా అదరగొట్టేసింది. 2003 భూమ్ సినిమాతో బాలీవుడ్ కెరీర్ మొదలు పెట్టిన అమ్మడు ఇప్పటికీ అదే క్రేజ్ కొనసాగిస్తుంది. ఐతే ఆఫ్టర్ మ్యారేజ్ కాస్త దూకుడు తగ్గినా కత్రినా పాపులారిటీ మాత్రం అలానే ఉంది. అంతకుముందు ఏడాదికి 2, 3 సినిమాల్లో నటించిన కత్రినా కైఫ్ ఇప్పుడు ఒకటి మాత్రమే చేస్తుంది. లాస్ట్ ఇయర్ మెర్రీ క్రిస్ మస్ తో అలరించిన కత్రినా కైఫ్ నెక్స్ట్ హౌజ్ ఫుల్ 5 తో రాబోతుంది. పెళ్లైనా ఆమె గ్లామర్ విషయంలో ఏమాత్రం తగ్గట్లేదు. ఐతే ఆఫ్టర్ మ్యారేజ్ అమ్మడు సెలెక్టెడ్ సినిమాలే చేస్తుంది. ఐతే ఈమధ్య బాలీవుడ్ హీరోయిన్స్ అంతా కూడా పాన్ ఇండియా మోజులో పడ్డారు. అందుకే తెలుగులో చేస్తున్న పాన్ ఇండియా సినిమాల వైపు చూస్తున్నారు. ఇప్పటికే బాలీవుడ్ భామలు అలియా భట్, దీపిక పదుకొనె, దిశా పటాని, కియరా అద్వాని, జాన్వి కపూర్ ఇలా అందరు కూడా బాలీవుడ్ నుంచి టాలీవుడ్ షిఫ్ట్ అయ్యారు. ఇక్కడ సినిమా ఛాన్స్ వస్తే మాత్రం అసలు వదులుకోవట్లేదు. ఐతే వీళ్లందరి కన్నా ముందే కత్రినా కైఫ్ తెలుగు ఆడియన్స్ కు పరిచయం ఉంది. భూమ్ తర్వాత అమ్మడు రెండో సినిమానే తెలుగులో వెంకటేష్ తో కలిసి మల్లీశ్వరి సినిమా చేసింది. బాలకృష్ణతో అల్లరి పిడుగు సినిమా కూడా చేసింది. తెలుగులో రెండు సినిమాలు చేసి ఆ తర్వాత ఇటు వైపు చూడని కత్రినా ఇన్నాళ్లకు మళ్లీ టాలీవుడ్ మీద ఆసక్తి చూపిస్తుందని తెలుస్తుంది. కత్రినా ఓకే అనాలే కానీ మన మేకర్స్ ఆమెను ఒప్పించి స్టార్ సినిమాలో చేయించేస్తారు. ఐతే ఏ సినిమా పడితే ఆ సినిమా కాకుండా మంచి బజ్ ఉన్న సినిమా.. పాన్ ఇండియా మొత్తం ఊపేసే సినిమా చేయాలని కత్రినా భావిస్తుంది. అలాంటి అవకాశం వస్తే మాత్రం వెంటనే యెస్ చెప్పేయాలని చూస్తుందట. మరి ఇన్నేళ్ల తర్వాత కంత్రినాని మళ్లీ తెలుగు తెర మీదకు తెచ్చే ప్రయత్నం ఎవరు చేస్తారన్నది చూడాలి. కత్రినా టాలీవుడ్ ఎంట్రీ కోసం అమ్మడి ఫ్యాన్స్ కూడా ఎగ్జైటింగ్ గా ఉన్నారు.



**ఆకాంక్ష సింగ్ ఒక ఫ్యాషన్ ట్రెండ్ సెట్టర్ కూడా అయిన బహుముఖ నటి**

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com